



సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాట్లు చేసిన దృశ్యం

65 కంపెనీలు..
5వేల ఉద్యోగాలు...

- నగరంలో నేడు మెగా జాబ్ మేళా
- ఎస్సీ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర యువజన సర్వీసులశాఖ, టీఎస్‌స్టెప్ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంనగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో మెగాజాబ్‌మేళాను నిర్వహించనున్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ఈ మేరకు నగరంలోని స్టేడియంలో పలు కంపెనీల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ జాబ్‌మేళాలో ఫార్మా, ఐటీ, మార్కెటింగ్ హెచ్‌ఆర్, కాల్‌సెంటర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, రియల్‌ఎస్టేట్, రిటైల్ మార్కెటింగ్, హౌస్‌కీపింగ్, స్టోర్‌మేనేజర్, డెలివరీబాయ్స్, వెల్డర్, ఫిట్టర్, చెఫ్, డ్రైవర్స్ రంగాలలో ఉద్యోగాలు కల్పించేందుకు సుమారు 65కంపెనీలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఆయా కంపెనీలలో ఐదు వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. గతేడాది నిర్వహించిన మేళాలో సుమారు 1,600 మంది ఉద్యోగాలు సాధించారు.

విద్యార్హతలు ఇలా..

జాబ్‌మేళాలో 7వ తరగతి నుంచి 10, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ పూర్తిచేసి 18నుంచి 35 సంవత్సరాల వయసున్న యువతీ యువకులు పాల్గొనవచ్చు. జాబ్‌మేళాలో పాల్గొనే వారికి వారి అర్హతను బట్టి ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగానే ఉద్యోగాలు కల్పించనున్నారు. అంతేకాకుండా గతేడాది జరిగిన జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగాలు రాని అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని టీఎస్ స్టెప్ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు దరఖాస్తుల స్వీకరణ మొదలవుతుంది. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్, పాస్ ఫొటోలు, అనుభవం సర్టిఫికెట్లు ఏవైనా ఉంటే ఒరిజినల్ కాపీలతో పాటు, జిరాక్స్ సెట్లను తీసుకొని రావాల్సి ఉంటుంది.

మనిషి చిన్న..
చదువులో మిన్న...




- ఉద్యోగం కోసం ఐదేళ్లుగా ఎదురు చూస్తున్న వీరబాబు
- నేటి జాబ్ మేళాలో ఇప్పిస్తామన్న కలెక్టర్

7

పోటీకి సై





- ఖమ్మం ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో పోటాపోటీ
- సోనియాగాంధీ బరిలోకి దిగకపోతే తమను పరిశీలించాలని దరఖాస్తులు
- పలువురు ప్రముఖులు సహా కొత్త తరం నాయకుల ఉత్సాహం
- తనకు మళ్లీ అవకాశం ఇవ్వాలంటున్న రేణుకాచౌదరి
- టికెట్ కోసం దరఖాస్తుకు నేడు చివరి తేదీ

ఖమ్మం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ ఆశావహులకు గుమ్మంగా మారింది. ఖమ్మం నుంచి ఏఐసీసీ నేత సోనియాగాంధీని పోటీ చేయాలని పీసీసీ రాష్ట్ర నాయకత్వం ఏకగ్రీవంగా కోరిన విషయం విదితమే.సోనియా పోటీచేస్తే ఆమె గెలుపుకోసం అంతా కృషిచేస్తామని, జిల్లా కాంగ్రెస్ నేతలు, మంత్రులు టికెట్ల ఆశావహులు ఇప్పటికే ప్రకటించారు.

అయితే సోనియాగాంధీ లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మంనుంచి పోటీ చేసేందుకు నిరాకరిస్తే మాత్రం, పలువురు ఆశావహులు పోటీకి సన్నద్ధత ప్రకటిస్తున్నారు. టికెట్ కోసం ఇప్పటికే కొందరు దరఖాస్తు చేయగా మరికొందరు ఇంకా చేసుకుంటున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో మెజారిటీ ఎమ్మెల్యే స్థానాలను గెలిచి మెరుగైన ఫలితాలు చూపించినా, ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేలు పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరడంతో అప్పుడు ఖమ్మం లోక్‌సభ టికెట్ ఇస్తామంటే ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో కేంద్రమాజీమంత్రి రేణుకాచౌదరి ఖమ్మంనుంచి పోటీచేసి ఓటమి చెందారు.

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ పరిధిలోని అన్ని స్థానాలు కాంగ్రెస్, సీపీఐ కూటమి గెలవడంతోపాటు భారీ ఆధిక్యతలు రావడంతో ఇప్పుడు ఖమ్మంనుంచి పోటీచేసేందుకు అందరూ సై అంటున్నారు.

కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి గతంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తాను పోటీచేశానని, ఇప్పుడు సోనియాగాంధీ పోటీచేయని పక్షంలో ఖమ్మం టికెట్ అడిగే హక్కు తనకు ఉందని ప్రకటించారు. హైదరాబాదులో తన అనుచరులతో సమావేశం నిర్వహించి పోటీకి సిద్ధమన్నట్టుగా సంకేతాలు ఇచ్చి, ఇదే విషయాన్ని ఆమె పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లేలా చేశారు. ఆమె రేపో, మాపో ఖమ్మం లోక్‌సభ టికెట్ కోసం దరఖాస్తు చేయబోతున్నారు.

ఇప్పటికే మాజీ ఎంపీ వి.హనుమంతరావు తనకు ఖమ్మం కాంగ్రెస్ టికెట్ కావాలని, సోనియా పోటీచేయని పక్షంలో తనకు అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని తరఫున కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు దరఖాస్తు చేశారు. మల్లు నందిని కూడా ఖమ్మం కాంగ్రెస్ టికెట్ కావాలని పట్టుబడుతున్నారు.

ఇక వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ కూడా ఖమ్మం లోక్‌సభ టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పటికే పలు ఆత్మీయ సమావేశాల్లో కేడర్ ఖమ్మం లోక్‌సభ ఎన్నికల బరిలో దిగాలని యుగంధర్‌ను డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి కూడా ఖమ్మం లోక్‌సభ టికెట్ ఆశిస్తున్నారు. ఈ మేరకు ఆయన గాంధీభవన్‌లో దరఖాస్తు చేశారు. సోదరుడు ప్రసాదరెడ్డి కోసం పొంగులేటి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

కాగా గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రానందున ఖమ్మం లోక్‌సభ టికెట్ తమకే ఇవ్వాలని మాజీఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు కూడా దరఖాస్తు చేశారు. పాలేరు టికెట్ ఆశించిన కాంగ్రెస్ నేత రాయల నాగేశ్వరరావు ఖమ్మం టికెట్ కోసం దరఖాస్తు చేయబోతున్నారు. ఖమ్మంకు చెందిన వ్యాపారవేత్త వీవీసీ సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ ఖమ్మం టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కూడా అసెంబ్లీ ఎన్నికల ఊపు కొనసాగుతుందని భావిస్తున్న నేపథ్యంలో మునుపెన్నడూ లేని విధంగా కాంగ్రెస్ టికెట్‌కు డిమాండ్ ఏర్పడింది. టికెట్‌ను ఆశిస్తూ దరఖాస్తు చేసేందుకు శనివారం (3వ తేదీ) చివరి రోజు కావడంతో ఇంకెంతమంది ఆశావహులు తెరమీదకు వస్తారనేది ఆసక్తికరంగా మారింది.

'పాలేరు' వైపు పరవళ్లు



పాలేరు జలాశయానికి వస్తున్న సాగర్ నీళ్లు

- ఎట్టకేలకు తరలివస్తున్న నాగార్జున సాగర్ జలాలు
- డ్యామ్ నుంచి 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల
- తీరనున్న నాలుగు జిల్లాల తాగునీటి వెతలు

కూసుమంచి, ఫిబ్రవరి 2: జిల్లా వాసులకు వేసవిలో తాగునీటి ఎద్దడి తీరనుంది. నాగార్జున సాగర్ జలాలు శుక్రవారం మధ్యాహ్నం పాలేరు జలాశయాన్ని తాకాయి. దీంతో జలాశయం నీటిమట్టం స్వల్పంగా పెరుగుతోంది. ఖమ్మంజిల్లాతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా ఇక్కడి నుంచి తాగునీరు అందిస్తుండగా వేసవి నేపథ్యంలో నీటి కొరత ఏర్పడింది. దీంతో భగీరథ అధికారులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన నాగార్జునసాగర్ అధికారులతో సమీక్షించి, నీరు విడుదల చేయాలని ఆదేశించారు. దీంతో బుధవారం రాత్రి సాగర్‌డ్యామ్ నుంచి నీరు విడుదల చేయగా శుక్రవారం మధ్యాహ్నానికి పాలేరు జలాశయానికి చేరుకున్నాయి. సాగర్ డ్యామ్ నుంచి 6వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా ప్రస్తుతం పాలేరుకు 2,500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా వస్తోంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. పాలేరు జలాశయంలో 23 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికిగాను 10.50 అడుగులకు నీరు నిల్వ ఉండగా శుక్రవారం సాయంత్రానికి అర అడుగు వరకు పెరిగిందని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా పాలేరు జలాశయాన్ని నీటిపారుదలశాఖ ఈఈ మంగళపూడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. మొదటిజోన్ నుంచి నీరు దుర్వినియోగం కాకుండా పూర్తిస్థాయిలో పాలేరుకు చేరేలా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా సాగర్‌డ్యామ్ నుంచి తాగునీటి అవసరాలకోసం 1.50 టీఎంసీల నీరు కేటాయించినట్లు పేర్కొన్నారు. పాలేరు జలాశయాన్ని పూర్తిస్థాయిలో నింపి జూన్ వరకు తాగునీటి అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

అర్హులు ఓటు హక్కు పొందాలి..

- ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల ఓటర్ల జాబితాలపై కసరత్తు
- 6వ తేదీ వరకు పట్టభద్రుల ఓటు దరఖాస్తుకు గడువు
- 8న లోక్‌సభ ఎన్నికల ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల
- ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాతోపాటు లోక్‌సభ ఎన్నికల ఓటర్ల ముసాయిదా జాబితా తయారీ కార్యక్రమం కొనసాగుతోందని ఖమ్మంజిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ వెల్లడించారు. ఐడీఓసీలోని తన చాంబర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలోని పట్టభద్రులు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇప్పటివరకు ఖమ్మం 53,463మంది దరఖాస్తులు చేసుకున్నారని, 6వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. 2020 అక్టోబరు 31 నాటికి పట్టభద్రులై ఉన్నవారు ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే వరకు కూడా దరఖాస్తులు చేయవచ్చని, అయితే అలా దరఖాస్తు చేసుకున్నవారిని అదనపు ఓటర్లుగా ఓటర్ల జాబితాకు అనుసంధానం చేస్తామన్నారు. రాజకీయపార్టీలు కూడా పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించేందుకు చైతన్యం కలిగించాలని సూచించారు.

ఇప్పటివరకు పట్టభద్రుల ఓటర్ల దరఖాస్తుల్లో అత్యధికంగా ఖమ్మం జిల్లా నుంచే వచ్చాయన్నారు. ఏప్రిల్ 4వరకు పట్టభద్రులు ఓటర్లుగా చేరేందుకు గడువు ఉంటుందని తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్‌తోపాటు ఆధార్ తదితర పత్రాలకు గెజిటెడ్ అధికారితో సంతకంతో ఫారం-18ద్వారా దరఖాస్తు చేయాలని తెలిపారు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా మళ్లీ విధిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రుల ఓటర్ల విషయంలో ఎవరికైనా అభ్యంతరాలుంటే ఫారం-7ద్వారా అభ్యంతరాలు తెలుపవచ్చని కలెక్టర్ సూచించారు.

ఇక లోక్‌సభ ఎన్నిక ఓటర్ల జాబితాను సైతం సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా 12,19,527మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు, 5,88,362, మహిళలు 6,31,078 ఇతరులు 87మంది ఉన్నారని తెలిపారు. 8వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. గతంలో వచ్చిన ఫిర్యాదులతోపాటు ఇటీవల వచ్చిన కొన్ని ఫిర్యాదులను కూడా విచారించి కొన్ని ఓట్లను తొలగించామని, అలాగే సాఫ్ట్‌వేర్ ద్వారా గుర్తించి రెండు ఓట్లు ఉన్న వారిలో ఒక ఓటు తొలగించామన్నారు. ఎక్కడైనా విద్యార్థులు గతంలో కళాశాలల హాస్టళ్లలో ఉండి చదువుకుని ఓటర్లుగా నమోదై తిరిగి వెళ్లిన వారిని కూడా గుర్తించి వారికి నోటీసులు జారీచేసి వారు కోరుకున్న చోట ఓటు మార్పుచేశామని తెలిపారు.

జిల్లాలో కొత్తగా 37,740మంది ఓటర్లు చేరారని కలెక్టర్ తెలిపారు. దొంగ ఓటర్లు ఎక్కడైనా ఉంటే ఫారం-7ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలో 1,456 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని, ఓటర్ల ముసాయిదా ప్రకటన తర్వాత కూడా కొత్త ఓటర్లు చేరవచ్చన్నారు. మార్పులున్నా ఫారం-8 ద్వారా దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. ఖమ్మంలో 5వ తేదీ నుంచి ఈవీఎంలను రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో తనిఖీ చేస్తామన్నారు. ఇప్పటి వరకు కేవలం వైరా నియోజకవర్గ ఎన్నికపైనే కోర్టుకు వెళ్లినందున ఆ నియోజకవర్గ ఈవీఎంలను ప్రస్తుతం తనిఖీ చేయబోమన్నారు. మిగిలిన నాలుగు నియోజకవర్గాల ఈవీఎంలను తనిఖీ చేస్తామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీపీఆర్వో ఎంఏ గౌస్‌పాషా పాల్గొన్నారు.



లోక్‌సభ ఎన్నికలపై 'గులాబీ' గురి

- నేడు భద్రాచలంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం
- పాల్గొననున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కవిత

7

కొంప ముంచిన 'బొమ్మాబొరుసు'

- దుండగుల మాటలు నమ్మి మోసపోయిన వృద్ధ దంపతులు
- రూ.2.55 లక్షల విలువైన నగలు, నగదు పోగొట్టుకున్న వైనం
- కదులుతున్న కారులోనే సాగిన ఘరానా మోసం

7



వివరాలు వెల్లడిస్తున్న బాధితులు కేతానాయక్, బాలి

బుద్ధివంకర పంతులుపై బదిలీ వేటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 2: భద్రాద్రి జిల్లా ఇల్లెందులోని సింగరేణి పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులను వేధించడంతోపాటు, అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై సింగరేణి యాజమాన్యం స్పందించింది. సదరు ఉపాధ్యాయుడిపై కొరడా ఝుళిపించింది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన "ఇదేం పని సారూ" అనే వార్తపై స్పందించిన సింగరేణి యజమాన్యం సదరు ఉపాధ్యాయుడిపై బదిలీవేటు వేసింది. ఇల్లెందు పట్టణంలోని సింగరేణి పాఠశాలలో వీరన్న అనే ఉపాధ్యాయుడు అదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల అసభ్యంగా, అనుచితంగా ప్రవర్తించడంతో బాధిత విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సింగరేణి అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో సదరు ఉపాధ్యాయుడు విద్యార్థులను వేధించినట్టుగా ఆధారాలతో రుజువు కావడంతో సింగరేణి విద్యాశాఖ జీఎం వెంకటేశ్వరరావు ఉపాధ్యాయుడిని, ఇల్లందు సింగరేణి పాఠశాల నుంచి గోలేట్ సింగరేణి పాఠశాలకు బదిలీ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు.

చుక్కల్లో వెల్లుల్లి

బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.380



ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 2: బహిరంగ మార్కెట్‌లో వెల్లుల్లి ఘాటెక్కింది. కేజీ వెల్లుల్లి రూ.380కు చేరుకోవడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. గతేడాది కేజీ రూ.25 నుంచి రూ.30లే ధర లభించడంతో నష్టాలు చవిచూసిన వెల్లుల్లి రైతులు... ఈ ఏడాది సాగు తగ్గించడంతో ఉత్పత్తి లేక ధరలు భారీగా పెరిగాయి. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేక వెల్లుల్లి వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ప్రస్తుతం పచ్చళ్ల సీజన్ కావడంతోపాటు ప్రతీ ఇంట్లోనూ, వేడుకల్లోనూ వెల్లుల్లి వినియోగం ఎక్కువగా ఉండడంతో గల్లీ మార్కెట్లలో పావుకేజీ వెల్లుల్లి రూ.90నుంచి రూ.110వరకు విక్రయిస్తున్నారు. స్థానిక రైతులు వెల్లుల్లి సాగు చేయకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో రవాణా చార్జీలు అధికంగా ఉండటంతో ధరలు మరింతగా పెరుగుతున్నాయని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

దక్షిణ అయోధ్య దశ తిరిగేనా?



- ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిధులిస్తామని సీఎం ప్రకటన
- భద్రాద్రి రామాలయ అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు
- రూ.150 కోట్లిస్తామని చిల్లిగవ్వ ఇవ్వని గత ప్రభుత్వం

భద్రాచలం, ఫిబ్రవరి 2: ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిధులు కేటాయిస్తామని సీఎం ప్రకటించడంతో దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం అభివృద్ధిపై మళ్లీ ఆశలు చిగురించాయి. భద్రాచల రామాలయం అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినా అవన్నీ కార్యరూపం దాల్చలేదు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రెండు దఫాల్లో రూ.150 కోట్లు కేటాయించినా ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయకపోవడంతో భక్తుల నుంచి తీవ్ర ఆక్షేపణలు వ్యక్తమయ్యాయి.

అయితే ఇటీవల రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్యాత్మిక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ప్రకటించడంతో మరోసారి భద్రాద్రి రామాలయ అభివృద్ధిపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఏప్రిల్ 17న శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాచలంలో ఈసారి నిర్వహించనున్న శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్‌రెడ్డి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకురానున్న తరుణంలో భద్రాద్రి రామాలయ అభివృద్ధికి వరాల జల్లు కురిపించే అవకాశాలున్నాయని ఆశిస్తున్నారు.

గత పదేళ్లలో...

భద్రాద్రి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని నాడు సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. 2015, 2016 శ్రీరామనవమి ఉత్సవాలకు ఆయన భద్రాద్రికి వచ్చారు. ఆ సమయంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని, అవసరమైతే తాను చినజీయర్‌స్వామితో వచ్చి భద్రాద్రి ఆలయాభివృద్ధి ప్రణాళికను రూపొందిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో 2017 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో భద్రాద్రి అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించి బడ్జెట్‌లో ఆమోదం తెలిపారు. అంతేకాకుండా దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, స్థపతి, ఆర్కిటెక్ట్ ఆనంద్‌సాయి, చినజీయర్‌స్వామి పలు మార్లు రామాలయాన్ని పరిశీలించి అభివృద్ధిపై మాస్టర్‌ప్లాన్ సైతం రూపొందించారు.

ఇందుకోసం అప్పుడు ఆర్‌అండ్‌బీ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ఎంతగానో కృషి చేశారు. కానీ తరువాత ప్రభుత్వం ఆలయ అభివృద్ధి ఊసు మరిచిపోయింది. తదుపరి 2019 వార్షిక బడ్జెట్‌లో మరోసారి భద్రాద్రి ఆలయ అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించినా, నిధుల మంజూరు జరగలేదు. యాదాద్రి అనంతరం భద్రాద్రి అభివృద్ధి అంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటనలు హామీలకే పరిమితమయ్యాయి.

అయితే కొత్త ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలకు నిధులు కేటాయిస్తామని ప్రకటించడంతో భద్రాద్రి రామాలయ అభివృద్ధిపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. అదిలాబాద్ ఇంద్రవెల్లిలోని నాగోబా దేవాలయ అభివృద్ధి పనులకు రూ.6కోట్లు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ అభివృద్ధికి రూ.20 కోట్లను కేటాయిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో భద్రాద్రి పుణ్యక్షేత్రానికి సైతం ఈసారి శ్రీరామనవమి నాటికల్లా అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక ప్రకటన వెలువడుతుందనే ఆశతో రామ భక్తులు ఎదురుచూస్తున్నారు. దశాబ్దకాలంగా అప్పటి ప్రభుత్వం భద్రాద్రిని నిర్లక్ష్యం చేయగా కొత్త ప్రభుత్వంలోనైనా భద్రాద్రి అభివృద్ధికి మోక్షం లభిస్తుందనే విశ్వాసంతో భక్తులు ఎదురుచూస్తున్నారు.

కేటగిరీ మార్పులో కేటుగాళ్లు ఎవరు!?

- అధికారులపై చర్యలు లేకుండానే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది రెన్యువల్‌కు ప్రతిపాదన
- నేడు ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

8

సింగరేణిలో అవకతవకలపై చర్యలు తీసుకోండి

●సీఎండీని కోరిన టీపీసీసీ సభ్యుడు జేబీ శౌరీ



సీఎండీకి ఫిర్యాదు చేస్తున్న టీపీసీసీ సభ్యుడు

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, ఫిబ్రవరి 2: సింగరేణి సంస్థలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ సభ్యులు ఎస్సీ సెల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ జేబీ శౌరీ, సీఎండీ బలరాంనాయక్‌ను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ లో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సింగరేణిలో 2015 నుంచి జరిగిన అనేక రకాల రాతపరీక్షలు, బదిలీలు, కారుణ్య నియామకాలలో అనేక అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు. తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని రెడ్డిపల్లిలోని పద్మశ్రీ అవార్డు గ్రహిత వనజీవి రామయ్య ఇంటివద్ద 'ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ' దినోత్సవం అటవీశాఖ అధికారులు చిత్తడి నేలలపై రూపొందించిన చిత్తడి నేల వాల్ పోస్టర్‌ను రామయ్య దంపతులు శుక్రవారం ఆవిష్కరించారు. రామయ్య మాట్లాడుతు జీవరాశి మనుగడకు నేలలు అత్యంత కీలకమన్నారు. భూమికి ఊపిరితిత్తులుగా పనిచేసే ప్రకృతి ఎంతో దోహదపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, డిప్యూటి రేంజ్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

రూటు మారితే వేటే..!

- కౌన్సిలర్లపై వేలాడుతున్న విప్ కత్తి
- ఇల్లెందు మున్సిపాలిటిలో అవిశ్వాసం ఉత్కంఠ
- స్టే కోసం తీవ్ర యత్నాలు

ఇల్లెందు, ఫిబ్రవరి 2: ఇల్లెందు మున్సిపాలిటిలో అవిశ్వాస తీర్మానం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావును బీఆర్ఎస్ కౌన్సిలర్లు గత ఏడాది కాలంగా పదవీచ్యుతున్ని చేయడానికి తీవ్రస్థాయిలో చేస్తున్న యత్నాలు క్లైమాక్స్‌కు చేరాయి. శాసనసభ ఎన్నికల ముందు చైర్మన్ డీవీ మరో ముగ్గురు కౌన్సిలర్లతో కాంగ్రెస్‌లో చేరినప్పటికీ కౌన్సిలర్ల అసమ్మతి చల్లారలేదు. పైగా గత నెలలో అసమ్మతి కౌన్సిలర్లు ఫారం-1 ఫార్మేట్‌లో అవిశ్వాస తీర్మానం కలెక్టర్ ప్రియాంక అలాకు అందజేయడంతో ఈనెల 5న అవిశ్వాస తీర్మానంపై బలపరిక్షకు కలెక్టర్ ఆదేశాలు జారీచేయడంతో మున్సిపల్ రాజకీయాలు వేడెక్కాయి. ఫిబ్రవరి5న మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో బలపరీక్ష జరగనుండడంతో అవిశ్వాస కౌన్సిలర్లు శిబిరానికి తరలిపోయారు. 10రోజులుగా అవిశ్వాస కౌన్సిలర్లు రహస్య క్యాంపులో వుంటూ బలపరీక్షలో చైర్మన్ డీవీని ఓడించేందకు యత్నాలు చేస్తుండగా అందుకు ధీటుగా కాంగ్రెస్ ముఖ్యనేతలు సైతం ప్రతి వ్యూహల్లో నిమగ్నమయ్యారు. అయితే అనూహ్యంగా బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం మాజీ ఎమ్మెల్యే హరిప్రియకు విప్ అధికారం ఇవ్వడంతో ఆమె 5న జరగనున్న ఇల్లెందు మున్సిపల్ ప్రత్యేక సమావేశానికి హజరై బీఆర్ఎస్ కౌన్సిలర్ల అవిశ్వానికి అనుకులంగా ఓటుచేయాలని విప్ జారి చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపొందిన మున్సిపల్ చైర్మన్ డీవీతో పాటు మిగత 18మంది కౌన్సిలర్లకు విప్ జారిచేయడంతో మున్సిపాలిటి అవిశ్వాస సమావేశంపై సర్వత్రా ఉత్కంఠతా నెలకొంది. గత మున్సిపల్ ఎన్నికల్లో 19మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లుగా ముగ్గురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లుగా, న్యూడెమోక్రసీ, సీపీఐనుంచి ఒకొక్కరు కౌన్సిలర్లుగా గెలుపొందారు. ఫలితంగా 19మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు పార్టీ విప్ జారీచేయడంతో తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. పార్టీ గుర్తుపై గెలుపొందిన కౌన్సిలర్లు విప్‌కు కట్టుబడి సమావేశానికి హజరై అవిశ్వాసానికి అనుకులంగా ఓటు వేస్తారా లేక విప్‌ను దిక్కరించి అవిశ్వాసాన్ని ఓడిస్తారా అనే అంశాలు హాట్ టాపిక్‌గా మారాయి.

విప్‌ను ఉల్లంఘిస్తే ?

ఇల్లెందులో బీఆర్ఎస్ మున్సిపాలిటి కౌన్సిలర్లుకు పార్టీ విప్ జారీ చేసిన విప్‌కు పార్టీ కౌన్సిలర్లు కట్టుబడి వుంటారా లేక విప్‌ను దిక్కరించి చైర్మన్ డీవీని యథావి దిగా కొనసాగించేందుకు పూనుకుంటారా అనేది చర్చనీయంశమైంది. నిబంధనల మేరకు పార్టీ విప్‌ను ఉల్లంఘించిన వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకో వాల్సి ఉంటుంది.విప్‌ను దిక్కరించి అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయడం, సమావేశానికి గైర్హాజర్ కావడం లాంటి అంశాలు విప్ ఉల్లంఘనగా పరిగణిస్తా రు. పార్టీ విప్‌ను దిక్కరించి కౌన్సిలర్లపై తక్షణం అనర్హత వేటు వేయడం, లేదా తదుపరి ఎన్నికల్లో పోటి చేసేం దుకు అనర్హులుగా ప్రకటించే అవకాశం లేదాఈ కొన్ని సంవత్సరాల పాటు పోటి చేసే అవకాశాలను రద్దు చేయ డం లాంటి చర్యలు విప్‌ను వ్యతిరేకించిన వారిపై అమలు చేసే నిబందనలు ఉన్నాయి. ఇవి సమావేశం ముగిసిన పిదప బీఆర్ఎస్ నాయకత్వం సమావేశం నిర్వహించిన ముఖ్యఅధికారి ఆర్‌డీఓ ద్వారా విప్ ఉల్లంఘించిన వారి పేర్లను తీసుకొని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా ఎన్నికల కమిషన్ విప్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. సమావేశానికి గైర్హాజర్ అయిన కౌన్సిలర్లు తగిన కారిణాలు చూపినట్లు అయితే తీవ్ర అనారోగ్యం పాలు కావడం, మెడికల్ గ్రౌండ్స్‌లో హాజరు కాలేని పరిస్థితులను వైద్యా నివేదికల ద్వారా తెలియజేయడం ద్వారా విప్ ఉల్లంఘన వేటు నుండి తప్పించుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇల్లెందు మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసు కుంటాయోనన్న ఊహగానాలు జోరందుకున్నా యి. అంతేగాక అధికార కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు తమను బెదిరింపులకు గురిచేస్తున్నరని పోలీసులు ఇతర సంఘ విద్రోహుల ద్వారా తమ కుటుంబ సభ్యులను వేదింపులకు గురిచేస్తు, తమను ప్రత్యేక సమావేశానికి రాకుండా అడ్డుకునే వ్యూహాలు చేస్తున్నరని, రక్షణ కల్పించి తాము 5న జరిగే సమావేశంలో పాల్గొనే అవకాశాలు కల్పించాలని క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు కలెక్టర్, ఎస్పీని కోరారు.ఈ పరిణామాలు అవిశ్వాస సమావేశం తీవ్రతను పెంచాయి. అయితే అసమ్మతి శిబిరంలో ఉన్న కౌన్సిలర్లలో కొందరు కాంగ్రెస్ ముఖ్య నాయకులతో టచ్‌లో వున్నట్లు, ఒక వైపు అసమ్మతి నేతలుగా వ్యవహరిస్తున్న కౌన్సిలర్లు, వారి భర్తలే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలతో, ముఖ్యనాయకులతో మంతనాలు జరుపుతుండడం, ఈమేరకు వారి ఫోటోలు కుడా సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడంతో అవిశ్వాసం రసకందాయకంలో పడినట్లు ప్రచారం జరుగుతుంది. కాంగ్రెస్‌లో చేరిన చైర్మన్ డీవీని అవిశ్వాసంలో గట్టెక్కించే బాధ్యత కాంగ్రెస్ నాయకత్వం పైనే వుండడంతో వ్యూహ ప్రతివ్యూహాలతో ఇల్లెందు మున్సిపల్ పరిణామాలు హాట్ హాట్‌గా మారాయి.



ఇల్లెందు మునిసిపల్ కార్యాలయం

సమాచారహక్కు ఉమ్మడి జిల్లా

కో ఆర్డినేటర్‌గా ఆవుల

ఖమ్మం చర్చికాంపౌండ్, ఫిబ్రవరి 2: సమాచారహక్కు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్‌గా ఆవుల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈమేరకు సమాచారహక్కు పరిరక్షణ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆవుల నాగేశ్వరరావు మాట్లాడుతూ నియమ నిబంధనలు అనుసరించి సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కలిపిస్తానని పేర్కొన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణంలో నావంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తానని తెలిపారు. నాపై నమ్మకంతో కో ఆర్డినేటర్‌గా నియమించినందుకు జాతీయచైర్మన్ కేశవులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా గోపి



ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 2: తెలంగాణ గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడి గా ఖమ్మం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో అర్థశాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. గోపి ఎన్నికయ్యారని యూనియన్ యూని ట్ ప్రెసిడెంట్ ఎం రవీంద్రారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్. గోపిని శాలువతో ఘనంగా సన్మానించారు. గోపి మాట్లాడుతూ సభ్యుల సమ స్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తాన న్నా రు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శాంతి కుమార్, యూనిట్ సభ్యులు వీరబ్రహ్మం, అనురాధ, డా ఐ కిరణ్‌కుమార్, ఎస్ బాబు తదితరు లు పాల్గొన్నారు.

ఒకే అధికారి నాలుగు ఉద్యోగ బాధ్యతలు

- వైరా ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డికి పరిమితికి మించి విధులు
- పూర్తిస్థాయిలో ఏ బాధ్యతలు నిర్వహించలేకపోతున్న అధికారి



వల్లాపురం జీపీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వైరా ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి

వైరా, ఫిబ్రవరి 2: ఖమ్మం జిల్లా వైరా మండలంలో ఒకే అధికారి నాలుగు ఉద్యోగ బాధ్యతల ను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. వైరా ఎంపీడీవో డి.కరుణాకర్‌రెడ్డి తన బాధ్యతలతో పాటు సుమారు 35వేల జనాభా కలిగి కీలకంగా ఉన్న వైరా మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఇప్పటికే విధులు నిర్వహిస్తున్నాడు. వీటికి తోడు తాజాగా శుక్రవారం పంచాయతీల్లో ప్రారంభ మైన ప్రత్యేక పాలనలో భాగంగా వైరా మండలంలోని వల్లాపురం, గోవిందాపురం పంచాయతీల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. సుమారు 55వేల పైచిలుకు జనాభా ఉన్న వైరా మండలానికి కరుణాకర్‌రెడ్డి ఎంపీడీవోగా వచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైరా మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న పతాని వెంకటేశ్వర్లు తమ ఆదేశాలను సరిగా అమలుచేయ కుండా విధుల్లో నిర్లక్ష్యం చూపారనే కారణంతో ఆయన్ని ఖమ్మం కలెక్టర్ వీపీ.గౌతమ్ విధుల నుంచి తప్పించి సెలవుపై వెళ్లాలని ఆదేశించారు. ఆయన స్థానంలో ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డిని మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. మూడునెలల నుంచి ఎంపీడీవో, కమిషనర్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మునిసిపాలిటీలో పూర్తిస్థాయి కమిషనర్ లేక ఇక్కడి పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అలాంటి కరుణాకర్‌రెడ్డికి గెజిటెడ్ అధికారి హోదాలో వల్లాపురం, గోవిందాపురం పంచాయతీల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. వైరా మండలంలో ఇంకా వివిధ శాఖలకు చెందిన గెజిటెడ్ అధికారులున్నా వారిని పంచాయతీ ప్రత్యేక అధికారులుగా నియమించకుండా ఎంపీడీవోనే బాధ్యతలు చేపట్టాల్సి రావడంతో ఆయనపై పని భారం పెరిగిపోయింది. దాంతో ఆయన ఏ విధులకూ పూర్తిగా న్యాయం చేయ లేని పరిస్థితి నెలకొంది. తద్వారా ప్రజాపాలన కుంటుపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఒకే అధికారికి నాలుగు ఉద్యోగ బాధ్యతలు లేకుండా ఒకట్రెండు బాధ్యతలకు పరిమితం చేసి ప్రజలకు సక్రమంగా సేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలలో సెలవు వివాదం

●మహిళా టీచర్ పట్ల హెచ్ఎం దురుసు ప్రవర్తన



టీచర్లతో చర్చలు జరుపుతున్న ప్రధానోపాధ్యాయుడు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 2: కూతురు వివాహనికి సెలవు అడిగినందుకు ఓ ఉపాధ్యాయురాలిపై హెచ్ఎం దురుసుగా ప్రవర్తించాడు. దీంతో బాధిత ఉపాధ్యాయినితో పాటు తోటి ఉపాధ్యాయులు క్లాసులు బహిష్కరించారు. ఈ ఘటన ఖమ్మం రూరల్ మండలం, జలగంనగర్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం జరిగింది. జలగంనగర్ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయిని తన కూతురు వివాహం కోసం సెలవులు కావాలని ప్రధానోపాధ్యాయుడికి లీవ్‌లెటర్ అందించారు. ఈ క్రమంలో సెలవు విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు బయటికి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో హెచ్ఎం తన పట్ల దురుసుగా ప్రవర్తించాడని తోటి ఉపాధ్యాయుల ముందు ఉపాధ్యాయినితో కన్నీటి పర్యంతమవ్వడంతో వారంతా ఆమెకు అండగా నిలిచారు. హెచ్ఎం ప్రవర్తనను నిరసిస్తూ తరగతులకు వెళ్లకుండా స్టాఫ్ రూమ్‌లో కూర్చొని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు సాయంత్రం పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మళ్లీ వారిమధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈ విషయం బయటికి తెలియడంతో హెచ్ఎం సదరు ఉపాధ్యాయినికి సెలవులు మంజురు చేశారు. దీంతో గొడవ సద్దుమణిగింది. అయితే ఈ ఘటనపై ప్రధానోపాధ్యాయుడు వివరణ ఇస్తూ తమ పాఠశాలలో ఎలాంటి గొడవ జరగలేదని, టీచర్లు ఎవ్వరూ విధులు బహిష్కరించి నిరసన తెలపలేదని తెలిపారు. జరుగుతున్నదంతా అసత్య ప్రచారమేనన్నారు.

పోలీస్‌శాఖలో క్రమశిక్షణ, సమయపాలన ముఖ్యం

- ఖమ్మం కమిషనర్ సునీల్‌దత్
- సిటీ, ఏఆర్ సిబ్బంది మొబలైజేషన్ ముగింపు కార్యక్రమం



పరేడ్‌లో పాల్గొన్న సీపీ సునిల్‌దత్, మాట్లాడుతున్న పోలీసు కమిషనర్

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 2: పోలీసు శాఖలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి వ్యక్తిగత క్రమశిక్షణ, సమయ పాలన చాలా ముఖ్యమని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పేర్కొన్నారు. నగరంలోని పోలీసుపరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన సిటీ ఏఆర్ సిబ్బంది 15రోజుల మొబలైజేషన్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు సహకారిగా ఉండే ఆర్మడ్ రిజర్వు పోలీసువిభాగానికి సమస్యలు నిలవరించే సమయస్పూర్తి ఉండాలన్నారు. 15రోజులుగా ఏఆర్ పరేడ్ గ్రౌండ్‌లో శిక్షణ ఇవ్వడం ద్వారా సిబ్బందిలో క్రమశిక్షణ భరితమైన విధినిర్వహణ అలవర్చుకుని ఆరోగ్యంగా ఉండడమే కాక మానసిక సమస్యలుకూడా దూరమవుతాయని తెలిపారు. దీనివలన శారీరక సామర్థ్యం మరింత మెరుగుపడుతుందన్నారు. శాఖపరమైన సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు పోలీసుసిబ్బందితో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటుచేసి సమస్యలు తెలుసుకున్నారు. అదేవిధంగా కమిషనరేట్ పరిధిలో పరిష్కరించే పదోన్నతి, ఇంక్రిమెంట్, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, ప్రభుత్వ పరంగా రావాల్సిన బెనిఫిట్స్ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. మొబిలైజేషన్ సందర్భంగా నిర్వహించిన ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీసుసిబ్బందిని సీపీ తన చేతులమీదుగా జ్ఞాపికను అందించారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీలు ప్రసాదరావు, కుమారస్వామి, ఏఆర్ఏసీపీలు నరసయ్య, సుశీల్‌సింగ్, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, తిరుపతి, అప్పలనాయుడు, పార్కు ఇన్‌చార్జి బి.రఘు పాల్గొన్నారు.

ఆటో పల్టీ- యువకుడి దుర్మరణం



పెద్దకృష్ణ(ఫైల్)

తల్లాడ, ఫిబ్రవరి 2: తల్లాడ మండలం అన్నారుగూడెం సమీపంలోని కాల్వకట్ట వద్ద ప్రధాన రహదారిలో ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ప్రమాదంలో యువకుడు దుర్మర ణం చెందాడు. ఈ ప్రమాదంలో అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఇనన్నపల్లి పెద్దకృష్ణ అలియాస్ ప్రసన్నకుమార్ (31)మృతిచెందాడు. తల్లాడ నుంచి అన్నారుగూ డేనికి ఆటోలో వస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పెద్దకృష్ణ తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చికిత్స కోసం 108 వాహనంలో ఖ మ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటోలో ప్ర యాణిస్తున్న పెద్ద కృష్ణ భార్యకు కూడా స్వల్పగాయాలయ్యాయి. పెద్దకృష్ణకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్దకృష్ణ తండ్రి నర్సింహారావు ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



పామాయిల్ చెట్లను పరిశీలిస్తున్న రైతులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 2: ఎదుగుదల లేని, గెలలు రాకుండా నష్టపోయినా పామాయిల్ రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన పామాయిల్ రైతులు కోరారు. శుక్రవారం మండలంలోని నారాయణపురంలో పుచ్చకాయల సోమిరెడ్డి పండించిన పామాయిల్ తోటలను సందర్శించారు. బాధిత రైతుకు తక్షణమే చేపట్టాల్సిన పలు యాజమాన్య పద్దతులు, ప్రభుత్వానికి తెలియజేయాలని సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో ఆలపాటి రాము, పిన్నమనేని మురళీ, తలశీల ప్రసాద్, కొక్కెరపాటి పుల్లయ్య, భీమిరెడ్డి కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, తుంబూరు చిలకారెడ్డి, తాళ్లూరి సత్యనారాయణ, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

బాలల భవిష్యత్ కోసమే

ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్

- ఖమ్మం సీపీ సునీల్‌దత్, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్
- ఆపరేషన్ స్మైల్‌లో ఇరు జిల్లాల్లో 91మందికి విముక్తి

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 2: బాలలకు బంగారు భవిష్యత్ అందించాలనే లక్ష్యంతో బాలకార్మికులకు విముక్తి కలిపించి తప్పిపోయిన చిన్నారుల ఆచూకి కనుకగొనేందుకు అధికారులు ఏటా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నామని ఖమ్మం పోలీసుకమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలకార్మికుల వ్యవస్థ, నిర్మూలన, బిక్షాటన చేసే బాలలు లేకుండా చూడడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం కార్యచరణ రూపొందించిన కార్యక్రమంలో భాగంగా మహిళ శిశుసంక్షేమ, పోలీసులు, కార్మిక, శిశుసంరక్షణ విభాగాలకు చెందిన అధికారులతో కూడిన కమిటీల ఆధ్వర్యంలో గత జనవరిలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించామన్నారు.ఈతనిఖీల్లో 70మంది బాలబాలికలకు విముక్తి కలిపించి వారి తల్లిదండ్రులకు అప్పగిచడంతోపాటు ఇతర రాష్ట్రాల బాలలను వారి ప్రాంతాలకు పంపించామన్నారు బడికి దూరమైన పిల్లలు, అనాధపిల్లలను బాలల కార్మికులను గుర్తించి వెట్టిచాకిరినుంచి విముక్తి కలిపించడంతో పాటు వారికి అక్షరజ్ఞానం కలిపించేలా చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఆయాశాఖలు సమ న్వయంతో పనిచేస్తున్నాయని ప్రకటన ద్వారా తెలిపారు.

ఆపరేషన్ స్మైల్‌లో 21 మందికి విముక్తి

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, ఫిబ్రవరి 2: బాల కార్మిక వ్యవస్థని నిర్మూలించడంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ ఎక్స్‌లో భాగంగా భద్రాద్రి జిల్లాలో 21 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. గత నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు ఆధ్వర్యంలో వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాలలో మొత్తం ఐదు బృందాలతో ఈ దాడులను నిర్వహించామన్నారు. వీరిలో ఏడుగురు బాలికలుండగా, 14 మంది బాలురున్నారు. బాలికలను పనిలో పెట్టుకున్న యాజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 15 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనపడితే డయల్ 100కి ఫోను చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

వరంగల్ సీపీని కలిసిన భద్రాద్రి ఎస్పీ రోహిత్



వరంగల్ సీపీతో కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, ఫిబ్రవరి 2: వరంగల్ పోలీసు కమిషనర్ అంబరికిషోర్‌ఝాను భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా వరంగల్‌లో కలిశారు. పుష్పగుచ్ఛంను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భద్రాద్రి జిల్లా తొలి ఎస్పీగా పని చేసిన అనుభవాలను సీపీ గుర్తు చేసి పంచుకున్నారు. జిల్లాలో నెలకొన్న శాంతిబద్రతలు, మావోయిస్టు కార్యకలాపాలు, ప్రస్తుత పరిణామాలు, ఇతర అంశాలపై ముచ్చటిచారు.

నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంపీ నామా పర్యటన

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 2: బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు శనివారం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారని ఆయన క్యాంప్ కార్యాలయవర్గాలు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం కొత్తగూడెంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో పాల్గొని అనంతరం మధ్యాహ్నం 3గంటలకు ఖమ్మంలోని నూతన కలెక్టరేట్‌లో జరిగే దిశ సమావేశానికి హజరవుతారు.

దమ్మపేట సొసైటీ చైర్మన్‌గా రాఘవరావు



అధ్యక్షుడిగా ఎన్నికైన రాఘవరావుతో ప్రమాణం చేయిస్తున్న డీసీవో

దమ్మపేట, ఫిబ్రవరి, 2: దమ్మపేట సొసైటి చైర్మన్‌గా ఎల్లిన రాఘవరావును డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సొసైటి కార్యాలయంలో శుక్రవారం జిల్లా సహకార సంఘం అధికారి వెంకటేశ్వర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దమ్మపేట సొసైటిలో 13 డైరెక్టర్లు వుండగా 11మంది డైరెక్టర్లు హజరై ఖాళీ అయిన సొసైటి చైర్మన్ పదవికి రాఘవరావును ఏక్రగ్రీంగా డైరెక్టర్లు ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు సొసైటి చైర్మన్‌గా కొనసాగిన రావు జోగేశ్వరరావును తొలగించాలని 11 మంది డైరెక్టర్లు సహకారం సంఘం అధికారులకు పిర్యాదు చేశారు. ఈమేరకు కొత్తగూడెం డీసీవో వెంకటేశ్వర్లు ఫిబ్రవరి 2న దమ్మపేట సొసైటికి అవిశ్వాసానికి తీర్మానం నోటిసులను డైరెక్టర్లకు పంపారు.

నూతనంగా దమ్మపేట సహకారం సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన రాఘవరావు మాట్లాడుతు తనకు సహకరించిన సొసైటి డైరెక్టర్లకు వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, రెవిన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు కాంగ్రెస్, టిడిపి, సిపిఎం, నాయకులకు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

రైస్‌మిల్ తనిఖీ చేసిన డీఎస్‌వో

దమ్మపేట, ఫిబ్రవరి, 2: దమ్మపేటకు చెందిన మురళీకృష్ణ రైస్‌మిల్‌ను శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి దేవి తనిఖీ చేశారు. దమ్మపేట, మందలపల్లి గ్రామాలకు చెందిన రైతులు పలువురు రైస్ మిల్‌లో ధాన్యం మర పట్టించగా 75 కిలోల ధాన్యం బస్తాకు 50కిలోల బియం రావల్సి వుండగా 35 కిలోలు మాత్రమే బియ్యం రావటంతో రైస్‌మిల్ యజమానిని నిలదీశారు. యజమాని పట్టించుకోక పోవటంతో రైతులు తహసీల్దార్‌కు, జిల్లా రెవెన్యూ అధికారులకు గురువారం పిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు రైస్‌మిల్‌ను రైతుల సమక్షంలో రైస్‌మిల్‌ను డీఎస్‌వో తనిఖీ చేశారు. రైస్‌మిల్‌పై చర్యల నిమిత్తం నివేదికను ఉన్నతాధికారుకు పంపనుట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన రైతులు కొండపల్లి కృష్ణమూర్తి తదితరులు మాట్లాడుతు రైస్‌మిల్ యజమాని ఎంతో మంది రైతులను ధాన్యం మర పట్టించుకునేందుకు వస్తే మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు.

రైస్‌మిల్ యజమానిపై కేసు నమోదు

రైతులు ధాన్యాని మర పట్టించేందుకు వస్తే రైస్‌మిల్ యాజమాని మోసం చేస్తున్నాడని రైతులు దమ్మపేట పోలీసులకు పిర్యాదు చేసారు. ఈసంఘటనకు సంభందించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మపేటకు గ్రామంలో గల మురళీకృష్ణ రైస్ మిల్లులో ధాన్యం మరపట్టిస్తే బియ్యం తక్కువగా వస్తున్నాయంటూ మందలపల్లికి చెందిన రైతులు కొండపల్లి జగపతి, కృష్ణమూర్తి తదితరుల పిర్యాదు చేసారు. పిర్యాదు మేరకు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ జరపుతున్నట్లు తెలిపారు.

236 కిలోల గంజాయి పట్టివేత

- కొత్తగూడెంలో 222 కిలోలు, తిరుమలాయపాలెంలో 14 కిలోలు స్వాధీనం
- పోలీసుల అదుపులో నిందితులు

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, ఫిబ్రవరి 2: కొత్తగూడెంలో 222.38 కేజీల గంజాయిని త్రీటౌన్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం ఆర్టీసీ పాత డిపో వద్ద సీఐ మురళీ, ఎస్ఐ ఖాజా మొయినుద్దీన్ తన సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ కంపెనీకి చెందిన వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా సీలేరు ప్రాంతం నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించి ఆ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ వాహనంలో 222.38 కేజీల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని తరలిస్తున్న నిందితుల్లో రాజస్థాన్ రాష్ట్రంలోని జోద్‌పూర్ జిల్లాకు చెందిన సునీల్, అదే ప్రాంతానికి చెందని శట్‌రామ్ అలియాస్ సత్పాల్ ఉండగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.55.59 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి పరారైన నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

14కేజీల గంజాయి పట్టివేత

తిరుమలాయపాలెం: మత్తుపదార్థాలపై ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా అక్రమ రవాణకు అడ్డుకట్ట లేకుండా పోతుంది. చత్తీష్‌గడ్‌నుంచి వరంగల్‌వైపు అక్రమంగా తరలిస్తున్న 14కేజీల గంజాయిని శుక్రవారం తిరుమలాయపాలెం పోలీసులు పట్టుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. చత్తీష్‌గడ్‌నుంచి ఇద్దరు వ్యక్తులు వివిద మార్గాల ద్వారా అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారు. చత్తీష్‌గడ్‌నుంచి బస్సులు, లారీలు, ఆటోల ద్వారా మారుస్తూ తరలిచేందుకు యత్నిస్తున్నారు. మండలంలోని సుబ్లేడు క్రాస్‌రోడ్‌వద్ద అనుమానస్పందగా ఓహోటల్‌లో ఇద్దరు వ్యక్తులను తిరుమలాయపాలెం ఎస్ఐ వరాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టుకుని విచారించారు. వారి వద్దనుంచి సుమారు 14కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి వారిని కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి విచారణ చేపడుతున్నారు.

ఆక్రమణకు గురైన భూమిని కాపాడాలి

●రెవెన్యూ కార్యాలయం ఎదుట యాదవుల ఆందోళన



రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యాదవులు

ముదిగొండ, ఫిబ్రవరి 2: ముదిగొండ రెవెన్యూ పరిధిలో తమ స్వాధీనంలో ఉన్న భూమిలో కొంతమంది ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి ఆక్రమించుకున్నారని అట్టి భూమిని వెలికితీయాలని శుక్రవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట యాదవులు ఆందోళన చేశారు. ముదిగొండ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 179లో 21మంది యాదవులకు పాస్‌పుస్తకాలు ఉన్నాయని ఆభూమిలో కొంతమంది ఫ్యాక్టరీ యజమానులు నిర్మాణం చేపట్టి ఇది మా భూమి అని బెదిరిస్తూ ఆక్రమించుకున్నదే కాక మాభూముల్లోనుంచి రాకపోకలు చేస్తూ మమ్మల్ని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేనెంబర్ 179 సర్వే చేసి హద్దులు నిర్ణయించారని, కొంతమేర ఆక్రమణకు గురైందని తెలిపారు. మా భూమిలో ఎటువంటి గవర్నమెంట్ నక్షా డొంక లేనప్పటికీ రహదారి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, నిర్మాణం చేపడితే ఆందోళనను ఉదృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఆక్రమణకు గురైన భూమి గురించి పలువురు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించలేదని ఇప్పటికైనా అధికారులు ఆక్రమణకు గురైన భూమిని వెలికితీయాలని వారు కోరారు. అనంతరం తహసీల్దార్ వై.రామారావు, ఎస్ఐ నరేష్‌కు అలాగే ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బట్టు పురుషోత్తం, బట్టు రాజు, మెట్టెల సతీష్, పుచ్చకాయల రామయ్య, ఉపేందర్, మాదాల శ్రీను పాల్గొన్నారు.

సుదిమళ్ల పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

●సంతకం ఫోర్జరీ చేసి నిధులు డ్రా చేసినట్లు సర్పంచ్ ఆరోపణ

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 2: ఇల్లెందు మండలం సుదిమళ్ల గ్రామపంచాయతీ కార్యదర్శి నాగమణిపై పలు అవినీతి ఆరోపణలు చేస్తు సుదిమళ్ల సర్పంచ్ కల్తీ పద్మ ఎంపీడీవో బాలరాజుకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌నైనా తనకు తెలియ కుండా తన సంతకాన్ని ఫోర్జరీ చేసి గత సంవత్సరం ఆక్టోబరులో గ్రామపం చాయతీ చెందిన రూ.37వేల నిధులను ట్రాక్టర్ డీజిల్ పేరిట డ్రా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిదంగా పంచాయతీలో విధులకు హాజరుకా కుండావిదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని, సర్పంచ్‌నైన తనకు సమాచారం ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. గ్రామ సభ తీర్మాణాలు సైతం తనకు తెలియకుండా ఉంచారని వివరించారు.ఈ విషయాలపై ఎంపీడీవో బాలరాజును వివరణ కోరగా సుదిమళ్ల సర్పంచ్ పద్మ గ్రామపంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేసింది వస్తావమే నని, పంచాయతీ నిధులఅక్రమాలపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికలపై 'గులాబీ' గురి

» నేడు భద్రాచలానికి మాజీ మంత్రి హరీష్‌రావు, మహబూబాబాద్ ఎంపీ కవిత రాక


ఇల్లెందులో హరీష్‌రావును కలిసిన స్థానిక నాయకులు

భద్రాచలం, ఫిబ్రవరి 2: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. ఈ స్థానం నుంచి తమ పార్టీ అభ్యర్థిపై కసరత్తుకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలోనే భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో శనివారం బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశాన్ని స్థానిక కేకే ఫంక్షన్‌హాల్లో నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి టి.హరీష్‌రావు, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొంటారు.

పట్టు నిలుపుకునేందుకు..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలంలో కాంగ్రెస్ అభ్యర్థిపై బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు విజయం సాధించారు. ఈ క్రమంలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తన పట్టును నిలుపుకునేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. మరో రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో మహబూబాబాద్ స్థానం నుంచి పోటీ చేసే పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీని భద్రాచలం స్థానంలో సాధించేందుకు ఆ పార్టీ నాయకులు, క్యాడర్‌కు మాజీ మంత్రి హరీష్‌రావు దిశానిర్దేశం చేయనున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భద్రాచలంలో గెలుపుతో ఉత్సాహంలో ఉన్న ఆ పార్టీ శ్రేణులు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ మరోసారి తమ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నాయి. ఈ క్రమంలో హరీష్‌రావు రాక వారిలో మరింత ఉత్తేజాన్ని నింపే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

తేనేటి విందులో హరీష్‌రావు

ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 2: సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీస్‌రావు శుక్రవారం రాత్రి ఇల్లెందు వచ్చారు. హైదరాబాద్ నుంచి భద్రాచలం వెళుతూ మార్గమధ్యలో ఇల్లెందులో కొద్ది సమయం ఆగారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దిండిగల రాజేందర్ ఇంట్లో తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడి వెళ్లి హరీష్‌రావును ఘనంగా సత్కరించారు.

కొంప ముంచిన 'బొమ్మాబొరుసు'

» దుండగుల మాటలు నమ్మి మోసపోయిన వృద్ధ దంపతులు » రూ.2.55 లక్షల విలువైన నగలు, నగదు పోగొట్టుకున్న వైనం


» కదులుతున్న కారులోనే సాగిన ఘరానా మోసం » పోలీసులకు బాధితుల ఫిర్యాదు, కేసు దర్యాప్తు చేస్తున్న వైరా, తల్లాడ ఎస్ఐలు

తల్లాడ/వైరా, ఫిబ్రవరి 2: లిఫ్టు ఇస్తామని చెప్పి వృద్ధ దంపతులను కారులో ఎక్కించుకొని దుండగులు పథకం ప్రకారం వారి నుంచి రూ.2.55 లక్షల విలువైన బంగారు నగలు, నగదును దోచుకున్నారు. ఈ ఘటన శుక్రవారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం ఎన్టీఆర్‌నగర్ సమీపంలో జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జూలూరుపాడ్ మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన వృద్ధదంపతులు వాంకుడోతు కేతానాయక్, బాలీ శుక్రవారం వైరాలోని లయన్స్ ఐ-శేర్ ఆసుపత్రిలో కంటి పరీక్షలు చేయించుకొనేందుకు వచ్చారు. పరీక్షల అనంతరం తిరిగి పాపకొల్లు వెళ్లేందుకు వైరా బస్టాండ్‌కు చేరుకున్నారు. వారిని గమనించిన కొందరు దుండగులు బస్టాండ్‌లోకి వెళ్లి ఎక్కడికి వెళ్లాలని వారిని ప్రశ్నించారు. జూలూరుపాడ్ వెళ్లాలని వారు చెప్పడంతో తాము కొత్తగూడెం వైపు వెళ్తున్నామని, కారులో ఉచితంగా తీసుకువెళ్తామని నమ్మించి వారిని టాటాసుమో వాహనంలో ఎక్కించుకున్నారు. ఆ సమయంలో ఆ కారులో మరో ఐదుగురు ఉన్నారు.

బొమ్మాబొరుసు ఆట ప్రారంభించారు

వైరా మండలం స్టేజీ పినపాక దాటగానే కారులో ఉన్న వ్యక్తులు బొమ్మాబొరుసు ఆట ప్రారంభించారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వృద్ధుడు వాంకుడోత్ కేతానాయక్‌ను రూ.50 బదులు ఇవ్వాలని అడిగి తీసుకున్నాడు. వెంటనే ఆట వేసి ఆ రూ.50కు రూ.100 వచ్చాయని సదరు వ్యక్తి ఆ నగదును కేతానా యక్‌కు ఇచ్చాడు. ఆ తర్వాత "రూ.10 వేలు ఉంటే ఇవ్వండి ఆటలో గెలిస్తే డబుల్ వస్తాయి" నమ్మించాడు. ఆశతో కేతానాయక్ తనవద్దనున్న రూ.5 వేలను అతడికి ఇచ్చాడు. అయితే మరోసారి బొమ్మా బొరుసు ఆట వేసి రూ.5వేలు ఆటలో పోయాయని వృద్ధుడికి తెలిపాడు. అనంతరం వృద్ధురాలు బాలి మెడలోని నాలుగుతులాల బంగారు గొలుసు పెట్టి ఆట ఆడితే రూ.లక్ష వస్తాయని దుండగుడు ఆ దంపతులను నమ్మించాడు. బాలి తన మెడలోని బంగారు గొలుసును తీసి ఇవ్వగా ఆటలో అదికూడా పోయిందని వారు నమ్మించారు. ఆ తరువాత కారులోని మరో దుండగుడు ఆ డబ్బు, నాలుగు తులాల బంగారు గొలుసును తీసుకొని తల్లాడ మండలం ఎన్టీఆర్‌నగర్ సమీపంలో దిగిపోయాడు. కారు తల్లాడ దాటిన తర్వాత వృద్ధ దంపతులు మిగిలిన వారితో గొడవపడ్డారు. ఈ క్రమంలో వారు వృద్ధ దంపతులను కారులో నుంచి బయటకు నెట్టి పరారయ్యారు. తాము మోసపోయామని గ్రహించిన వృద్ధ దంపతులు తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ విషయాన్ని తెలు సున్న వైరా సీఐ ఎన్.సాగర్ సంఘటనాస్థలాన్ని పరిశీలిం చారు. వైరా, తల్లాడ ఎస్ఐలు మేడా ప్రసాద్, బి.కొండ ల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోలీసులకు సంఘటన గురించి వివరిస్తున్న బాధిత వృద్ధ దంపతులు


వృద్ధ దంపతులు ప్రయాణించిన వాహనం (సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాల ఆధారంగా)

60 రోజుల్లో 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

» ఆ దిశగా అందరూ పని చేయాలి » జీఎంలకు సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ ఆదేశం

» హైదరాబాద్ సింగరేణిభవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్


జీఎంలతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్

కొత్తగూడెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వచ్చే 60 రోజుల్లో 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా పెట్టుకోవాలని, ఆ దిశగా అందరూ పని చేయాలని సింగరేణి జీఎంలను సీఎండీ బలరామ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు ఉత్పత్తి పురోగతి, నూతన ప్రాజెక్టులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్ గరిష్ఠంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో థర్మల్ కేంద్రాలు నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి వీలుగా బొగ్గు రవాణా చేయాలని స్పష్టం చేశారు. రోజుకు కనీసం 2.3 లక్షల టన్నులకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి చేస్తే నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకో వచ్చన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తి రవాణా ఆశాజనకంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 10 నెలల కాలంలో 56.7 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకోగా 56.3 మిలియన్ టన్నులను సాధించగలిగామని, గత ఏడాది ఇదే సమయానికి సాధించిన ఉత్పత్తి లక్ష్యంపై 4 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు తెలిపారు. 56.7 మిలియన్ టన్నుల బొగ్గు రవాణాను లక్ష్యంగా నిర్దేశిం చుకోగా 57.23 మిలియన్ టన్నులను రవాణా చేశామని.. గత ఏడాదితో పోల్చితే బొగ్గు రవాణా విషయంలో 6 శాతం వృద్ధి నమోదయిందని వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 344 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించామని, గత ఏడాదితో పోల్చితే 4 శాతం అధికం అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాలనుకున్న ఒడిస్సా లోని నైనికోల్ బ్లాక్, కొత్తగూడెం ఏరియాలోని వీకే కోల్ మైన్, బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఓసీ, ఇల్లందు ఏరియాలోని జేకే ఓసీ గని ప్రారంభానికి కావాల్సిన అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి. సత్యనారా యణరావు (ఈఅండ్‌ఎం), ఎన్‌వీకే శ్రీనివాస్ (ఆపరేషన్స్), జీ.వెంకటేశ్వరరెడ్డి (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్)జే. అల్విన్, జీఎం (కో ఆర్డినేషన్), ఎం. సురేశ్ జీఎం (సీపీపీ). జక్కం రమేష్ జీఎం (మార్కెటింగ్) జి.దేవేందర్ పాల్గొన్నారు.

చెట్లు నరికితే జైలుకే

» వన్యప్రాణులకు హాని తలపెడితే కఠిన చర్యలు » ఆదివాసీలకు అటవీ శాఖ హెచ్చరిక

» మనుబోతులగూడెంలో తనిఖీలు » కణుజు కొమ్ములు, ఇతర ఆయుధాల స్వాధీనం


ఆదివాసీల నుంచి స్వాధీనం చేసుకున్న కొమ్ములు, బాణాలతో అటవీ శాఖ సిబ్బంది

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 2: 'చెట్లను నరకొద్దు. నరికితే జైలుకే. వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దు. ఇలాంటి పనులు చేయడం చట్టారీత్యా నేరం. అందుకు శిక్ష పడుతుంది. కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని' అటవీ శాఖ అధికారులు ఆదివాసీలను ఉద్దేశించి హెచ్చరిం చారు. శుక్రవారం మణుగూరు అటవీ రేంజ్ పరిధిలోని మారుమూల మనుబోతులగూడెంలో తనిఖీలు నిర్వహించారు. ఆదివాసీలకు అటవీ చట్టాలు, వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. అడవుల్లో సంచరించే వన్యప్రాణులను సంరక్షణ కింద జంతువుల వేటాడడం నేరమని, వేటకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, క్షీణించి పోతున్న జంతు సంపదను కాపాడుకోవాలన్నారు. అడవులను నరికినా, జంతువులను వేటాడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాగులు, వంకలు దాటి..

మణుగూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి ద్వాలియా ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం వేకువజామునే వాగులు, వంకలు దాటుకుంటూ.. మారుమూల చిట్టడివిలోని మనుబోతులగూడెం చేరుకున్నారు. అటవీ మార్గంలో ఓ వాగు వద్ద వెంట తెచ్చుకున్న అల్పాహారం తిన్నారు. గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో బాగంగా ఆదివాసీల నుంచి కణుజు కొమ్ములను, నాటు విల్లులను, బాణాలను, ఉచ్చులను స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు వేటకు ఉపయోగించే ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు నాగరాజు, సలూజ, ముజీదుద్దీన్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

మనిషి చిన్న.. చదువులో మిన్న

» ఉద్యోగం కోసం ఐదేళ్లుగా ఎదురుచూపు » గత మంత్రులను కలిసినా ప్రయోజనం శూన్యం

» కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని వినతి » ఇదీ టేకులపల్లికి చెందిన వీరబాబు దీనగాథ


చేతిలో దరఖాస్తుతో వీరబాబు

ఖమ్మం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి)

అతడి ఎత్తు మహా అయితే రెండు అడుగులకు మించదు. చదువులో మాత్రం దిట్ట. ఎంఏ ఎకనమిక్స్ చదివాడు. పేద కుటుంబం.. అందులోనూ తండ్రి కూలీ చేస్తేనే గడిచే పరిస్థితి ఉండటంతో.. కుటుంబానికి తాను భారం కావొద్దనే ఆలోచన అతడిని వేధించేది. ఏదైనా సాధించాలనే తలంపుతో గడిచిన ఐదేళ్లల్లో అనేక ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేశా డు. పేపర్లు లీక్ కావడం, పరీక్షలు రద్దు కావడంతో అతడి ఆశలు అడియా సలయ్యాయి. దీంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తనకు సర్కారు కొలువు దక్కుతుందనే ఆశతో అతడిని ఖమ్మం కలెక్టరేట్ వైపు నడిపించింది.

ఖమ్మం నగరంలోని టేకులపల్లికి చెందిన వీరబాబుది నిరుపేద కుటుంబం. ఎంఏ చదివినప్పటికీ గడిచిన ఐదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడం తప్ప, వచ్చిన దాఖలాలు లేవు. తండ్రి కూలీతో చేసుకుని జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన అతడికి ప్రభుత్వం ఇచ్చే ఆసరా పింఛన్ రూ.4వేలే జీవనాధారం. తన అర్హతలకు తగిన ఉద్యోగం ఇవ్వాలని, దివ్యాంగుల ఉద్యోగాల్లో తాత్కాలికంగానైనా తనను భర్తీచేయాలని ఐదేళ్లగా గత ప్రభుత్వంలోని మంత్రులు, అధికారులకు దరఖాస్తు చేసుకున్నా ఫలి తం లేకుండా పోయింది. మళ్లీ ఈప్రభుత్వం లోనైనా తనకు ఉద్యోగం వ స్తుందన్న ఆశ వీరబాబులో కనిపిస్తోంది. ఇటీవల కలెక్టర్‌ను కలిసి ఉద్యోగానికి దరఖాస్తు చేశాడు. శుక్రవారం కలిసి మరోసారి విన్నవించుకున్నారు. ఖమ్మంలో శనివారం నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తా నని కలెక్టర్ హామీ ఇచ్చారు. అయితే జాబ్‌మేళా వంటి ఉద్యోగాలు కాకుండా తన అర్హతకు తగిన ఉద్యోగం ఇవ్వాలని వీరబాబు కోరుతున్నారు. కలెక్టరే ట్‌లోని వీరబాబును ఆంధ్రజ్యోతి కదిలించగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సార్ మా లాంటి దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రత్యేకంగా భర్తీ చేసి మొదటి ప్రాధాన్యతగా ఉద్యోగం ఇవ్వాలని తన ఆవేదన చెప్పుకు న్నాడు. 'ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత దివ్యాం గురాలు రజనికి ఉద్యోగం ఇవ్వడంతో మా అందరికికూడా ఉద్యోగా లు వస్తాయనుకుంటున్నాం. మా అర్హతకు తగిన గుర్తింపు వస్తుందని భావి స్తున్నాం. నాన్న కూలీ పనితో మా కుటుంబం జీవనం సాగిస్తోంది. ఎన్నో అవరోధాలు అధిగమించి చదువుకున్నా ఉద్యోగం రావడం లేదని' ఆవే దన వ్యక్తం చేశాడు. వీరబాబు దరఖాస్తుపై కలెక్టర్ వీపీ గౌతమ్‌ను వివరణ కోరగా ఖమ్మంలో శనివారం జరిగే జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అందులో తగిన ఉద్యోగం ఇచ్చేందుకు పిలిపించి సమాచారం ఇచ్చామని తెలిపారు. జాబ్‌మేళాలో ప్రాధాన్యం కల్పిస్తామన్నారు.

ఆదివాసీ మహిళల్లో చైతన్యం తేవాలి

» ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ » సఖీ వన్ స్టాప్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 2: ప్రస్తుత పరిస్థితుల్లో ఆదివాసీ మహిళలను చైతన్యవంతులను చేయాలి. అన్యాయాలు, అక్రమాలపై వివరించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం సఖీ వన్ స్టాప్ కేంద్రంపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాల గురించి అర్థమయ్యే రీతిలో సఖి సెంటర్ కౌన్సిలర్లు ఆదివాసీ మహిళలకు తెలియజేసి చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. గిరిజన మహిళలు, ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, కులం కట్టుబాట్లు పాటించడంలో ముందుంటారన్నారు. కొన్ని గ్రామాల్లో మహిళలు ముఖ్యంగా నిరక్షరాస్యులు, బయట ప్రపంచం తెలియకపోవడంతో చాలా అవమానాలకు గురవుతున్నారన్నారు. వారికి సఖీ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు వారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సఖీ వన్‌స్టాప్ పరిపాలనాధికారి శుభశ్రీ, రాజమణి పాల్గొన్నారు.

కిష్టారం భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి: ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, ఫిబ్రవరి 2: కిష్టారం ఓసి భూనిర్వాసితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆర్డీవోను కోరారు. శుక్రవారం కల్లూరు ఆర్డీవో కార్యాలయానికి ఎమ్మెల్యే రాగమయి నేరుగా వెళ్లి కిష్టారం భూ నిర్వాసితుల సమస్యల గురించి ఆర్డీవో మాట్లాడారు. కిష్టారం ఓసీ కోసం నిర్వాసితుల నుంచి సేకరించిన భూమికి ప్రస్తుత మార్కెట్‌ను అనుసరించి నష్ట పరిహారం అందించాలని ఆర్డీవో ఆశోక చక్రవర్తిని కోరారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

కల్లూరులోని రైతువేదిక ప్రాంగణంలో ఎమ్మెల్యే రాగమయి పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆశోక చక్రవర్తి, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో రవికుమార్, పసుమర్తి చందర్‌రావు పాల్గొన్నారు.

గిరివికాస్ బోర్ల పరిశీలన

కామేపల్లి, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని జోగ్గూడేనికి జర్పుల రవీందర్ అనే గిరిజన రైతుకు గిరివికాస్ పథకం కింద మంజూరైన వ్యవసాయ బోర్ మోటర్‌ను ట్రెయినీ కలెక్టర్ మయాంక్ సింగ్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయం మీద ఆదారపడి జీవిస్తున్న గిరిజన రైతలను ఆదుకోవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ పథకంలో గిరిజన రైతులకు ఉచితంగా బోర్ వేసి కరెంట్ కనెక్షన్‌తో పాటు మోటర్ బిగించి ఇస్తామన్నారు. ఈ పథకం గిరిజన రైతుల ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగపడతుందన్నారు. ఈ పథకాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీరాణి, టీఏ బాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్యా, రైతు జర్పుల రవీందర్ పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో దిశ కమిటీ సమావేశం

ఖమ్మం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతిప్రతినిధి)

జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ దిశ కమిటీ సమీక్షా సమావేశం శనివారం ఖమ్మం నూతన కలెక్టరేట్‌లో జరగనుంది. ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు దిశ కమిటీ ఛైర్మన్ హోదాలో సమీక్షా సమావేశం నిర్వహించబోతున్నారు. గతేడాది మే 5నదిశ కమిటీ సమావేశం జరగ్గా.. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమావేశం జరగలేదు. శనివరాం జరిగే దిశ కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించబోతున్నారు. ప్రధానంగా పీఎంజీఎస్‌వై, ఈజీఎస్, జాతీ య రహదారుల నిర్మాణం, గ్రామీన మంచినీటి సరఫరా , స్వచ్ఛభారత్, జాతీ య సామాజిక భద్రతా పథకం, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ సడక్‌యోజన, అంత్యోదయ యోజన, జిల్లా మహిళ శిశుసంక్షేమం, తోపాటు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో అమలువుతన్న పట్టణ, గ్రామీణపథకాలపై ఈ సమావేశం జరగనుంది. జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా పలువురు ప్రజాప్రతినిధులు దిశ కమిటీలో సభ్యులుగా హాజరుకానున్నారు.

ఖమ్మం కాంగ్రెస్ టికెట్‌కు

వీవీసీ రాజేంద్రప్రసాద్ దరఖాస్తు


గాంధీ భవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న వీవీసీ సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి 2: ఖమ్మం పా ర్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా వీవీసీ గ్రూప్ సంస్థల అధి నేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ దరఖాస్తు చేశా రు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు వెళ్లిన ఆయన స్వ యంగా దరఖాస్తును అందించారు. వీవీసీ సంస్థల ఆధ్వర్యంలో రాజేంద్ర ప్రసాద్ ఉమ్మడి జిల్లాలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తనకు ఖమ్మం కాంగ్రెస్ టిక్కెట్ కేటాయించాలని రాజేంద్రప్రసాద్ పార్టీ బాధ్యులను కోరారు.

మైనింగ్ అక్రమాలపై కొరడా

» ప్రత్యేక బృందాలతో జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు

» మట్టి అక్రమాలపై ప్రత్యేక దృష్టి » గ్రానైట్ ఫ్యాక్టరీల్లోనూ సోదాలు


ముదిగొండలో ఓ గ్రానైట్ పరిశ్రమను తనిఖీ చేస్తున్న మైనింగ్ అధికారులు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 2: జిల్లాలో గ్రానైట్, మట్టి, కంకర, తదితర మైనింగ్ అక్రమాలపై మైనింగ్ అధికారులు దృష్టిసారించారు. వారం రోజులుగా జిల్లాలోని పలు గ్రానైట్, మట్టి, కంకర క్వారీల అక్రమ తోలకాలపై ప్రత్యేక దృష్టి సారించి రాత్రి, పగలు తేడా లేకుండా దాడులు నిర్వహిస్తున్నారు. ఖమ్మంతో పాటు పక్క జిల్లాలకు చెందిన పలువురు మైనింగ్ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అనుమతులు లేని క్వారీలపై దాడులు మొదలు పెట్టారు. రోజూ ఉదయం ఒక బృందం, రాత్రి ఒక బృందం ప్రత్యేకంగా దాడులు చేస్తూ ప్రభుత్వానికి పెనాల్టీ రూపంలో ఆదాయాన్ని సమకూర్చుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అంది స్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వ హయాంలో మైనింగ్ కార్యకలాపాల్లో భారీగా అక్రమాలు జరిగినట్టు రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ఒక్కో క్వారీపై దశలవారీగా వివరాలను బయటకు తీయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి జిల్లా మైనింగ్ శాఖకు ఆదేశాలు వచ్చాయి. భారీగా ఆరోపణలు ఉన్న క్వారీల్లో నేరుగా హైదరాబాద్ నుంచి రాష్ట్ర అధికారుల బృందం వచ్చి తనిఖీలు చేపడుతోంది. జిల్లాలో ప్రస్తుతం అనుమతి పొందిన మేజర్, మైనర్ క్వారీలు 232 ఉన్నాయి. అయితే ఈ క్వారీల్లో గతంలో అంతగా తనిఖీలు లేవు. అందులో కొంతమంది రాజకీయ నాయకులకు చెందినవి ఉండడంతో అధికారులు అటువైపు దృష్టి సారించలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పరిస్థితి తారుమారైంది. క్వారీ లీజు సమయంలో ఎన్ని క్యూబిక్ మీటర్లకు అనుమతి ఇచ్చారు?, ఎన్ని క్యూబిక్ మీటర్ల తవ్వకాలు జరిపారు? ఒకవేళ ఉల్లంఘన జరిగితే ఎంత మొత్తంలో జరిగింది? తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో అక్రమ మట్టి తోలకాలపై ప్రత్యేక దృష్టి సారించిన మైనింగ్ అధికారులు ఆ దిశగా ప్రత్యేక అధికారులను నియమించి దాడులు నిర్వహిస్తున్నారు. అక్రమంగా మట్టి తోలకాలు నిర్వహించిన వారిని విడిచిపెట్టి అనుమతులు ఉన్న మట్టి క్వారీలపై దాడులు చేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో 232 మైనింగ్ అనుమతులు

జిల్లా వ్యాప్తంగా 232 క్వారీలకు అనుమతులున్నాయి. వాటిలో బ్లాక్ గ్రానైట్ క్వారీలు 161, స్టోన్ అండ్ మెటల్ 53, గ్రావెల్ 3, క్వార్ట్జ్ 1, డోలోమెంట్ 4, కోరండం 3, బైరటీస్ 2, తోపాటు కోల్ 1 మొత్తం 232 క్వారీ లకు అనుమతులున్నాయి. జిల్లాలో గ్రానైట్ క్వారీలు ఎక్కువగా ముతపడ్డాయి. 50 వర కు లీజు క్వారీలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మట్టి అక్రమ తోలకా లు యథేచ్ఛగా నడుస్తుండగా వాటితో పాటు స్టోన్ అండ్ మెంటల్ క్వారీల్లో కూడా అక్రమాలు జరుగుతున్నాయి. ఒకచోట లీజుకు తీసుకొని మరోచోట తవ్వకాలు చేయడం, ఒకే బిల్లుతో పదుల సంఖ్యలో తోలకాలు చేయడం వంటి అక్రమాలు అనేకం సాగుతున్నా వారిపై మైనింగ్ అధికారులు చర్య లు తీసుకోపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం లో కొందరు రాజకీయ నాయకుల ఆదేశాలతో అక్రమ తోలకాలు నిర్వహిం చిన వ్యాపారులు ప్రస్తుతానికి సైలెంట్‌గా ఉన్నారు. కానీ వారు ఎంత మొత్తంలో అక్రమ తోలకాలు నిర్వహించారనే దానిపై సర్వే నిర్వహిస్తే ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. కానీ నామ మాత్రంగా సర్వేలు చేసి కొందరికే నోటీసులు అందించారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి.

స్లాబ్ విధానంలో లేని గ్రానైట్ ఫ్యాక్టరీలపై నిఘా

జిల్లాలో ప్రస్తుతం 400 వరకు గ్రానైట్ స్లాబ్, 120 వరకు గ్రానైట్ టైల్స్ ఫ్యాక్టరీలున్నాయి. వీటిలో ఎక్కువగా ప్రభుత్వం తీసుకొచ్చిన స్లాబ్ విధానం ఉండగా మరికొన్ని పరిశ్రమలు అందులో లేవు. దీంతో మైనింగ్ అధికారు లు ముందు స్లాబ్ విధానంలో లేని గ్రానైట్ ఫ్యాక్టరీలలో తనిఖీలు నిర్వహిం చి ఉన్న స్టాక్‌కు సంబంధించిన బిల్లులు పరిశీలిస్తున్నారు. బిల్లులు లేని స్టాకుకు భారీగా ఫైన్ వేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. జిల్లాలోని అన్ని గ్రానైట్ ఫ్యాక్టరీల్లో తనిఖీలు ఉంటాయ మైనింగ్ అధికారులు చెబుతు న్నారు. గ్రానైట్ పరిశ్రమపై గత పది సంవత్సరాలుగా లేని తనిఖీలు ఇప్పుడే ఎందుకు చేస్తున్నారో తెలియక ఫ్యాక్టరీల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

20 మార్కులకు 58 బృందాలు

» పదో తరగతి ఇంటర్నల్ మార్కుల తనిఖీ ప్రారంభం » ఎంఈవోలకు పర్యవేక్షణ బాధ్యత


ఖమ్మం ఖానాపురం హవేలీ, ఫిబ్రవరి 2: పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల తనిఖీకి విద్యాశాఖ అధికారులు ప్రత్యేక బృందాలను నియమించారు. సబ్జెక్టు మార్కులు 100 కాగా.. ఫార్మెటివ్ అసెస్‌మెంట్ విధానంలో 20 మార్కులకు పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా విద్యార్థికి మార్కులు కేటాయిస్తారు. వార్షిక పరీక్షల్లో 80 మార్కులకు ప్రశ్నపత్రాన్ని అందజేస్తారు. 20 మార్కులను పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులే మూల్యాంకనం చేసి కేటాయిస్తారు. ఈ మార్కులు, సమాధాన పత్రాలను పరిశీలించి పాఠశాలలు సక్రమంగా మార్కులు నమోదు చేశాయా? లేదా? అనే అంశంపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలు జిల్లాలో గురువారం ప్రారంభం కాగా శుక్ర, శని వారాలు అన్ని పాఠశాలల్లో కొనసాగనున్నాయి.

సబ్జెక్టు నిపుణుల కేటాయింపు..

తనిఖీలకు వెళ్లిన అధికారుల బృందంలో ముగ్గురు సబ్జెక్టు నిపుణులు ఉంటారు. వీరు ఆయా సబ్జెక్టుల ఆధారంగా ప్రతి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తారు. సంబంధిత మార్కుల ప్రొఫార్మాను పోల్చుతూ విద్యార్థి రాసిన సమాధానపత్రాలు సరిగ్గా ఉన్నాయో.. లేదో.. సరిచూస్తారు. దీంతోపాటు విద్యార్థి రాసిన సమాధానాలకు ఉపాధ్యాయులు సరిగ్గా మార్కులు వేశారా? ఏమైనా తప్పులు దొర్లాయా? ఇతరాలేమైనా ప్రభావం చూపాయా? అనే కోణంలోనూ పరిశీలిస్తారు. విద్యార్థి హాజరు పట్టికలు, ప్రాజెక్ట్ రిపోర్టులను పరిశీలిస్తారు. సబ్జెక్టు నిపుణులు పరిశీలించిన వాటిలో హెచ్చు తగ్గులు ఉంటే సంబంధిత బృంద నాయకుడికి వివరిస్తారు. లోపాలుంటే ఆ నివే దికను కన్వీనర్ డీసీఈబీ సెక్రటరీ ద్వారా డీఈవోకి అందజేస్తారు.

ఎంఈవోల పర్యవేక్షణ..

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల తనిఖీలను మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షించనున్నారు. ఎంఈవోలు సూచించిన విధంగా ఆయా బృందాలు పాఠశాలల్లో తనిఖీలు చేస్తున్నారు.. యాజమాన్యాలవారీగా ఎయిడెడ్, బీసీ వెల్ఫేర్, ప్రభుత్వ, ఐటీడీఏ, కేజీబీవీలు, ఎంఎస్, ప్రైవేట్, టీఎస్‌ఆర్‌ఎస్, టీఎస్‌డబ్ల్యూఈఎస్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో కలిపి జిల్లాలో మొత్తం 16,514 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు రోజుకు రెండు లేదా మూడు స్కూళ్ల చొప్పున 423 పాఠశాలల్లో తనిఖీలు చేయనున్నారు. బృందాలకు అనుగుణంగా ఒక్కో టీముకు 10 నుంచి 13 వరకు స్కూళ్లను కేటాయించారు. ఒకే ప్రాంతంలో ఉండి.. దగ్గరగా ఉన్న స్కూళ్లయితే రోజుకు మూడు చేసేలా సూచనలు చేశారు.



మరుగుదొడ్ల బిల్లులను వెంటనే అందించాలి

అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



కొణిజర్ల, ఫిబ్రవరి2: కేంద్రప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్‌లో మంజూరు చేసిన మరుగుదొడ్ల బిల్లులను వెంటనే లబ్ధిదారులకు మంజూరు చేసి అందించాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం కొణిజర్లలో మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్ల వివరాలను యాప్‌లోనమోదు చేసి బిల్లులను వెంటనే చెల్లించాలని సూచించారు. మండలానికి 72 మందికి సంబంధించి బిల్లులు రావాల్సి ఉండటంతో వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, ఎంపీడీవో మహాలక్ష్మీ, ఎస్‌బీఎం అధికారులు అనూప్, జక్రియా, అజీఎస్ అధికారులు సునీల్‌రాజ్, అమ్మాజాన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో సబ్సిడీల కోతలపై రైతుసంఘాల నిరసన

వైరా, ఫిబ్రవరి2: కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ, ఆహార రంగాల్లో సబ్సిడీలకు కోతలు విధించటాన్ని నిరసిస్తూ రైతుసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం వైరాలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. వైరా బస్టాండ్ సెంటర్లో తెలంగాణ రైతుసంఘం, రైతుకూలీసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు బొంతు రాంబాబు, కె.అర్జున్‌రావు, పైడిపల్లి సాంబశివరావు, పారుపల్లి కృష్ణారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, సంక్రాంతి నర్సయ్య, తోట నాగేశ్వరరావు, గారపాటి అశోక్, యలదండి బాబు, డి.శిరీష, యనమద్ది రామకృష్ణ పాల్గొన్నారు.

కాలం చెల్లిన చక్కెర బస్తాల పరిశీలన

వైరా, ఫిబ్రవరి 2: వైరా సివిల్‌సప్లయి గోదాముల్లో కాలం తీరి విషపూరితమైన చక్కెర బస్తాలను శుక్రవారం సీపీఎం బృందం సందర్శించి పరిశీలించింది. పేదప్రజలకు పంపిణీ చేయాల్సిన లక్షలాదిరూపాయల విలువైన పంచదారను వృథా చేయటం పట్ల సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, నాయకులు సంక్రాంతి నర్సయ్య, చింతనిప్పు చలపతిరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

చింతకాని,ఫిబ్రవరి2: పశువుల ఆరోగ్య విషయంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పాతర్లపాడు ఎంపీటీసీ బొర్రా ప్రసాద్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పాతర్లపాడులో పశుధన్ జాగృతి అభియాన్‌లో భాగంగా పీవీ నరసింహరావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం మామునూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కాండ్ర పిచ్చయ్య, మాజీ ఉపసర్పంచ్ తేలుకుంట్ల శ్రీను, విశ్వవిద్యాలయం సంచాలకులు ఆర్ పురుషోత్తం, ఏడీ శ్రీరమణి, శ్రీనివాసరావు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని కలకోట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో శుక్రవారం హైదరాబాద్ వెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పశువైద్య శిబిరం విజయవంతమైంది. జాతీయ సేవా పథకంలో బాగంగా ఉచిత వైద్య శిబిరంలో పశువులు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ పట్ల అవగాహన కల్పించారు.

ఎఫ్‌డీసీని రద్దుచేసి భూములను పేదలకు పంచాలి

సత్తుపల్లిరూరల్,ఫిబ్రవరి2:తెలంగాణఅటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ ఎఫ్‌డీసీ)ని రద్దుచేసి ఆ భూములను పేదలకు పంచాలని ఆదివాసీ జీవన విధానం ఆధ్వర్యంలో సత్తుపల్లి తహసీల్దార్ యోగీశ్వరరావు, ఎఫ్‌డీవో వాడపల్లి మంజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీ.క్రాంతి, సోయం బాబూరావు, తాండ్ర బుచ్చిబాబు, కారం వెంకటేష్, ఈసం విజయ్ పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల రికార్డుల పరిశీలన

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి2: పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్క్స్ రికార్డులను నగరంలోని శ్రీచైతన్య పాఠశాల, రెజోనెన్స్ ఇన్‌ఫో, సర్వజ్ఞ పాఠశాలలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ పరిశీలించారు. ప్రాజెక్టులను భౌతిక, రసాయ, గణిత శాస్త్రంలో వివిద ప్రశ్నలను విద్యార్థులను అడిగిరు. విద్యార్థులు ఇచ్చిన సమాదానాలతో సంతృప్తి చెందారు.

విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

చింతకాని, ఫిబ్రవరి2: మండల పరిధిలోని వందనం గ్రామానికి చెందిన మేకల కాపరులు బాణోతు సక్కు, రంగమ్మ దంపతులు గతేడాది సుబాబుల్ తోటలో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందారు. విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన పది లక్షల రూపాయల పరిహారాన్ని ఏడీఈ తిలక్ చెక్కు రూపంలో మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈ వెంకన్న, గ్రామస్థులు కొరిపల్లి శ్రీను, వెంకన్న, నీరుడు హరీష్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ క్యాలెండర్ల ఆవిష్కరణ

బోనకల్, ఫిబ్రవరి2: బోనకల్‌లో శుక్రవారం విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్లను సంఘ మండల అధ్యక్షుడు వజ్రాల సత్యనారాయరాణ విష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు రావుట్ల రామాచారి, చిట్టుజీ శ్రీనివాస్, బుర్గుల అప్పాచారి, కృష్ణామాచారి, రామబ్రహ్మం, ప్రసాద్, రామయ్య, పర్వతాచారి, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ స్టేషన్‌ను ప్రత్యేక పంచాయతీ చేయాలని వినతి

బోనకల్,ఫిబ్రవరి2: మండల పరిధిలోని రావినూతల, బోనకల్ స్టేషన్ ప్రాంతాల్లో గల 11,12 వార్డులను ప్రత్యేక పంచాయతీ చేయాలని శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ డీపీవో హరికిషన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరుణాకర్, కృష్ణ ప్రసాద్, షైనేని రవి కుమార్, అఖిలపక్ష నాయకులు గంగూరి రాఘవరావు, పర్సబోయిన వీరభద్రం, మచ్చా గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కేటగిరీ మార్పులో కేటుగాళ్లు ఎవరు?

- అధికారులపై చర్యలు లేకుండానే
- అవుట్‌సోర్సింగ్ సిబ్బంది రెన్యువల్‌కు ప్రతిపాదన
- నేడు ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ కౌన్సిల్ సమావేశం



ఖమ్మం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయం కేంద్రంగా కొందరు అధికారులు తప్పులు చేస్తుంటే ఆయా తప్పులను కప్పిపెట్టేందుకు మరొ తప్పు చేస్తూ ఉన్నతాధికారులు అబాసుపాలవుతున్నారు... దొంగఇంటి నెంబర్ల కేటాయింపుల నుంచి మొదలుకుని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు, ఆయా ఉద్యోగుల కేటగిరిలను మార్చడం వంటి పలు అంశాలు ఇటీవల కాలంగా ఒక్కొక్కటిగా వెలుగులోకి రావటం తెలిసిందే... ఆయా అంశాల్లో మొదట చర్యలు చేపడుతున్నప్పటికీ ఆ తర్వాత మాత్రం తప్పులు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవటం లేదు.

కేటగిరీ మార్పు తప్పిదం ఎవరిది?

ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ప్రస్తుతం మూడు కెటగిరీల్లో 984 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారిలో కేటగిరీ 1 కింద 682, కేటగిరి 2 కింద 277 మంది, కేటగిరీ 3 కింద 25 మంది ఉన్నారు. వారిలో ఇప్పుడు కేటగిరీ 2లో ఉన్న ఉద్యోగులు గతంలో కేటగిరీ1 లో ఉండగా... పీఆర్సీ సమయంలో కేటగిరీల విభజనలోనూ అధికారులు ఎలాంటి సర్టిఫికేట్ల వెరిఫికేషన్ లేకుండానే తమకు అనుకూలంగా ఉండే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కేటగిరీలను మార్చి జీతాలను పెంచారన్న ఆరోపణలు ఉన్నాయి. కేటగిరి-1 లో రూ. 13,334 వేలు జీతం ఉండగా.. కేటగిరీ-2లో రూ. 17,354 వేల జీతం ఉంటుంది. అయితే కేటగిరీ-2 కు సంబంధించి ఆయా ఉద్యోగులు టెక్నికల్ సర్టిఫికేట్లను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అలాంటి సర్టిఫికేట్లు ఏమి లేకుండానే వందల సంఖ్యలో ఉద్యోగులను కేటగిరి 2లో లిస్టులో చేర్చి జీతాలు పెంచిన విషయం బయటకు పొక్కి విషయం హైద్రాబాద్ వరకు చేరింది. దాంతో ఆయా ఉద్యోగులకు ఓ సంస్థ ద్వారా మూడు రోజులపాటు శిక్షణ కల్పించారు. కేటగిరీ2లోకి మార్చిన ఉద్యోగులకు పెంచిన జీతాలను మాత్రం 2021 ఎప్రిల్ నుంచే ఇస్తుండగా.. సదరు ఉద్యోగులకు మాత్రం శిక్షణ ఇచ్చిన సంస్థ వారు 2023 ఆగస్టులో సర్టిఫికేట్లను ఇవ్వడం గమనార్హం. కాగా కేటగిరిల మార్పు విషయంపై కౌన్సిల్ సమావేశంలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

హుటాహుటిన సర్టిఫికెట్లు తెప్పించుకుంటున్న అధికారులు

మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సందర్భంలో అందులో తీర్మానం చేయాల్సి ఉన్న పలు అంశాల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కొనసాగింపు కూడా ఉండగా.. తీర్మానం చేసే సమయంలో కేటగిరీలు మార్చిన అంశం తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దాంతో అధికారులు హుటాహుటిన కేటగిరి-2లో మార్చిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల టెక్నికల్ సర్టిఫికేట్లు తెప్పించుకున్నట్లు సమాచారం. అయితే కేటగిరిల మార్పు అంశం గురించి ప్రస్తావనకు వచ్చినప్పుడు సర్టిఫికేట్లు చూపించాలన్న యోచనలో ఉన్న సదరు అధికారులు మాత్రం ఆయా సర్టిఫికేట్లపై సంబంధిత సంస్థవారు జారీ చేసిన తేదీ గమనించకపోవడం గమనార్హం. కేటగిరిల మార్పు నుంచి జీతాలు పెంచి ఇస్తుండగా.. సర్టిఫికేట్లు జారీ చేసిన తేదీకి అదనంగా ఇచ్చిన నగదును లెక్కిస్తే కార్పోరేషన్‌కు రూ. కోట్లలోనే నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పలువురు అధికారుల దగ్గర అటెండర్లుగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కేటగిరి-2లోనే ఉండగా.. వారిలో చాలామంది వేలిముద్ర వేసేవారుండటం గమనార్హం. కాగా కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసేందుకు పలు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. వాటిల్లో ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న 984 మందిని మార్చి 2025 వరకు కొనసాగించేందుకు, 20మంది డీఆర్‌ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్)సిబ్బందిని ఇకమీదట కూడా కొనసాగించాలనీ తీర్మానం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటితోపాటుగా ఖమ్మం నగరంలోని పలు స్థలాలకు సంబంధించిన జోన్లను మార్చే అంశాలపై, మరికొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు కేటాయించే అంశాలపై నేడు తీర్మానం చేయనున్నారు.

సిరిపురంలో దొంగల హల్‌చల్

ఓ ఇంట్లో రూ.60వేల నగదు చోరీ

మధిరరూరల్,ఫిబ్రవరి2: మధిర మండలం సిరిపురం గ్రామంలో శుక్రవారం దొంగల హల్‌చల్ చేశారు. కుడుపుగంటి చిన్నబుజ్జిబాబు ఇంట్లో దొంగలు చొరబడి బీరువాలో ఉన్న రూ.60వేల నగదును అపహరించుకుపోయారు. కూలీపనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి రాత్రి ఏడుగంటల సమయంలో చూసేసరికి బీరువా పగులగొట్టి ఉండటం చూసి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. చిన్నబుజ్జిబాబు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. రాత్రి ఏడుగంటల సమయంలో ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టడంతోపాటు ఇంట్లోని బీరువా తాళాలు పగులగొట్టి వస్తువులన్నీ చిందరవందరగా పడవేసి ఉన్నాయి. దీంతో చుట్టూపక్కల వారికి, పోలీసులకు సమాచారం తెలియజేశాడు. బీరువాలోని రూ.60వేల నగదు అపహరించుకుపోయినట్లు బాధితుడు తెలిపాడు. సిరిపురం గ్రామ నడిబొడ్డులో ఈ ఘటన జరగడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు లక్ష్మీపురం ఫీడర్‌లో విద్యుత్‌కోత

వైరా,ఫిబ్రవరి2:వైరా సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం ఫీడర్‌లో శనివారం కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ ఎస్ఎస్ఎస్.కుమార్ తెలిపారు. లక్ష్మీపురం ఫీడర్‌లోని 11కేవీ లైన్ల మరమ్మతుల నిర్వహణ కోసం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఫీడర్‌లోని వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి2: పార్కుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. శుక్రవారం నగర పాలకసంస్థ కార్యాలయం లో పార్కులు, డివైడర్ల నిర్వహణపై సంబంధిత సూపర్‌వైజర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్లు పార్కులను ప్రతిరోజు తనిఖీ చేయాలన్నారు. ప్రతిపార్కు ఉదయం 5గంటలకు తెరిచి, 9:30 గంటల వరకు, అలాగే సాయంత్రం 4:30 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఉంచాలన్నారు. పార్కును పరిశుభ్రంగా ఉండేలా సూపర్‌వైజర్లు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. పార్కుల్లోని టాయ్‌లెట్లను నిత్యం శుభ్రం చేయా లన్నారు. డివైడర్ల మధ్య నాటిన మొక్కల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నించిన కమిషనర్ కార్మికులు ఏరోజు ఎక్కడ పని చేస్తున్నారో పుస్తకంలో నమోదు చేయాలని ఆదేశించారు.

ప్రతీ డివిజన్‌లో ఫాగింగ్ నిర్వహించాలి

నగరపాలకసంస్థ పరిధిలోని ప్రతీ డివిజన్‌లో ఫాగింగ్ నిర్వహించాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. శుక్రవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో పారిశుధ్య విభాగపు శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, జవాన్లు, ఫాగింగ్ వర్కర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఫాగింగ్ చేసే కార్మికుల జాబితా తనకు అందచేయాలన్నారు. ఫాగింగ్ ఏ రోజు ఎక్కడ నిర్వహిస్తున్నారో తెలిసేందుకు ఒక పుస్తకం నిర్వహించాలన్నారు. కాలువ శుభ్రం చేసిన ప్రాంతంలో, అక్కడి స్థానికులతో సంతకాలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. జవాన్లు, ట్రాక్టర్‌డ్రైవర్లు విధల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఆదర్శ్‌సురభి హెచ్చరించారు.

కూసుమంచిలో ఎరువుల దుకాణాల తనిఖీ

కూసుమంచి, ఫిబ్రవరి 2: ఎరువుల విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కూసుమంచి, పాలేరు, నర్సింహులగూడెం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె వెంట ఏడీఏ విజయచంద్ర, ఏవో వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించాలి

- కలెక్టర్ గౌతమ్

ఖమ్మం, ఫిబ్రవరి2: గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించాలని కలెక్టర్ వీపీ. గౌతమ్ అన్నారు. కలెక్టర్ శుక్రవారం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి కొణిజర్ల మండలంలో పర్యటించారు. వి.వెంకటాయపాలెం, తనికెళ్ల గ్రామ. పంచాయతీల తనిఖీ చేశారు. ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నది పరిశీలించారు.ప్రత్యేక అధికారులు వివిధ గ్రాంట్లకు సంబంధించి నగదు పుస్తకాలు, సాధారణ నిధులు, ఉపాధి నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, సమావేశాలు, గ్రామ సభల రిజిస్టర్లను తదితరాలన్ని పరిశీలించి తీసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, డివిజనల్ పంచాయతీ అధికారి పుల్లారావు, కొణిజర్ల ఎంపీడీవో మహాలక్ష్మి, తనికెళ్ల ప్రత్యేకాధికారి సురేష్, పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, మురళీకృష్ణ ఉన్నారు.

అంగన్‌వాడీల్లో మెను పాటించాలి

ఖమ్మంరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెను ప్రకారం పిల్లలకు ఆహారం అందించాలని కలెక్టర్ గౌతమ్ అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, మండల పరిషత్ ప్రాధమిక పాఠలను శుక్రవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయిలోనే పిల్లలకు మంచి భోజనం అందించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరును పరిశీలించారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్

రికార్డుల్లోని ప్రతి పేజీని స్కానింగ్ చేయాలి

రఘునాథపాలెం: పంచాయతీల్లోని ప్రతి రికార్డులోని పేజీలను స్కానింగ్ చేసి భద్రపర్చాలని, రికార్డులు నిర్వహణ క్రమ పద్దతిలో చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం వీ వెంకటాయ పాలెం గ్రామ పంచాయతీని కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డులను క్షుణంగా పరిశీలించారు. క్యాష్ బుక్‌కు ఇతర రికార్డులను సరిచూశారు. నూతనంగా బాధ్యలు చేపట్టే ప్రత్యేక అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీపీవో హరికిషన్, డీఎల్‌పీవో, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

వేంసూరు, ఫిబ్రవరి2: మండలంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి పంపిణీ చేశారు. 51మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక్ చక్రవర్తి, తహసీల్దార్ ఎం.ఏ.రాజు, కాంగ్రెస్ నాయకులు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, కుక్కపల్లి శ్రీనివాసరావు, యర్రా సత్యనారాయణ, తక్కెళ్లపాటి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పెనుబల్లి: మండలంలో 29మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో అశోక్ చక్రవర్తి, తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, ఎంపీటీసీ వంగా ఝాన్సీ నిరంజన్, చీకటి రామారావు, షేక్.కరీముల్లా పాల్గొన్నారు.

సత్తుపల్లి: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యేలిరాగమయి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ దొడ్డా హైమావతి, కల్లూరు ఆర్డీవో పాల్గొన్నారు.

మల్లు నందినికి ఎంపీ టిక్కెట్ ఇవ్వాలి

ముదిగొండ, ఫిబ్రవరి2: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని ఖమ్మం ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్ కోరారు.

తాజా మాజీ సర్పంచ్‌లకు ఘన సన్మానం



నేలకొండపల్లి సర్పంచ్ నవీన్‌ను సన్మానిస్తున్న అధికారులు

నేలకొండపల్లి, ఫిబ్రవరి2:తాజా మాజీ సర్పంచ్‌లను శుక్రవారం మండల పరిషత్ కార్యాయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సన్మానించారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని మండలంలోని 32 మంది సర్పంచ్‌లను సత్కరించారు. ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ శివ పాల్గొన్నారు.

ముదిగొండ: నవతేజ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం సర్పంచ్ మందరపు లక్ష్మీ, వెంకన్న దంపతులను సన్మానించారు. తహసీల్దార్ రామారావు, ఎంపీడీవో అశోక్‌కుమార్ లక్ష్మీ సేవలను కొనియాడారు.

కారేపల్లి: సర్పంచ్‌ల సేవలు మరువలేనివని కారేపల్లి రూరల్ సీఐ బి.తిరుపతిరెడ్డి, ఎంపీడీవో ఎం.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కారేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సన్మానించారు.

కామేపల్లి: తాళ్లగూడెంలో ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ లకావత్ సునీత, ఉప సర్పంచ్ పుచ్చకాయల సత్యనారాయణను సత్కరించారు. కామేపల్లిలో మాజీ సర్పంచ్ రాందాస్, అర్జున్ పాలకవర్గాన్ని పంచాయతీ కార్యదర్శి పెండ్ర అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి సన్మానం కార్యక్రమం జరిగింది. పింజరమడుగు సర్పంచ్ గుగులోత్ దేవి, ఉపసర్పంచ్ వింజం నాగభూషణాన్ని గ్రామస్థులు సన్మానించారు.

ఆలయానికి రూ. 30వేల వితరణ

కామేపల్లి, ఫిబ్రవరి2: కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం గ్రామంలోని సమ్మక్క-సారలమ్మ అమ్మవారి గద్దెలకు దన్నూరి బాలరాజు నాగమణి దంపతులు రూ. 30వేల వితరణగా అందజేశారు. పండితాపురం గ్రామసులు వారి శాలువతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా 'ఉపాధిహామీ' దినోత్సవం

ఎర్రుపాలెం ఫిబ్రవరి2: మండలంలోని ఎర్రుపాలెం, మీనవోలు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి డి.శిరీష కేక్ కట్‌చేసి కూలీలకు స్వీట్స్ పంపిణీ చేశారు. స్త్రీశక్తి భవన ఆవరణలో మండలంలో జరిగిన ఉపాధిపనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు పూర్తి చేయటంలో జాప్యం వహించిన సెక్రటరీలను, పనులు పూర్తిచేయని ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానా విధించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ శిరీష, ఏపీడీ పి. వెంకటపతిరాజు,అంబుడ్స్‌మెన్ కె.రమేష్‌బాబు, విజిలెన్స్ సూపరిండెంట్ శాస్త్రీ, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ పవన్,ఎస్ఆర్‌పీ రమేష్,ఏపీవో కె.నాగరాజు పాల్గొన్నారు.

చింతకాని: కొదుమూరు, లచ్చగూడెం, నాగులవంచ గ్రామాల్లో డీఆర్‌డీవో విద్యాచందన పర్యటించారు. మహిళా కూలీలతో కేక్‌కట్ చేయించారు.

మధిర రూరల్: మండల పరిధిలోని దేశినేనిపాలెం జరిగిన వేడుకల్లో ఎంపీడీవో సిలార్‌సాహెబ్ పాల్గొని కూలీలు, సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు.

కారేపల్లి: కారేపల్లి మండలంలోని బాజుమల్లాయిగూడెంలో ఉపాధి హామీ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం జరుపుకున్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ దాసరి కరుణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

దక్షిణ భారత బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో రెజొనెన్స్ శ్రీనగర్‌కు తృతీయ స్థానం



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంఖానాపురంహవేలి,ఫిబ్రవరి2:నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల రెజొనెన్స్ స్కూల్ విద్యార్థినులు డి.శ్రీవల్లి, జి.గాయత్రి,(9వతరగతి) శుక్రవారం జరిగిన బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపించి సౌత్ ఇండియా వైజ్ఞానిక ప్రదర్శనలో తృతీయ స్థానంలో నిలిచారు. వీరిని కలెక్టర్ వీపీ.గౌతమ్, జిల్లా విద్యాశాఖఅధికారి సోమశేఖర శర్మ, జిల్లా సైన్స్ అధికారి జగదీష్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లానుంచి దక్షిణ భారతస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్రమైన పోటీ ఉంటుందన్నారు. చిన్నవయసులోనే సైంటిఫిక్ ఆలోచనలతో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకొని జిల్లాకు గౌరవం తీసుకురావడం గొప్పవిషయం అన్నారు. రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ ఉన్నత ఆశయాలతో, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం యం.ప్రసన్నరావు,సైన్స్ ఉపా ధ్యాయులు పి.హరిబాబు, బి.హరికృష్ణ అభినందించారు.

ఆర్‌ఆర్ హైస్కూల్ ఉపాధ్యాయుడి ప్రాజెక్టు ఎంపిక



ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న డీఈవో

సౌత్ ఇండియా వైజ్ఞానిక ప్రదర్శనలో నగరంలోని ఆర్.ఆర్ హైస్కూల్‌కు చెందిన బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు మీర్ హబీబ్ ప్రదర్శించిన ప్రాజెక్ట్ ఎంపికైంది. దాదాపుగా 50రకాల టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్స్ తయారు చేసి ఈ ప్రదర్శనలో ప్రదర్శించారు. విజయవాడలో జరిగిన ఈ ప్రదర్శన అక్కడ పలువురి మన్ననలు పొంది దక్షిణ భారతస్థాయిలో ఎంపిక చేయబడినది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీష్, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ సైన్స్ ఉపాధ్యాయులు మీర్ హబీబ్‌ని, పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

పది విద్యార్థుల అల్పాహారానికి వితరణ



చింతకాని,ఫిబ్రవరి2: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందించేందుకు వీలుగా గ్రామానికి చెందిన వంకాయలపాటి ట్రస్టు బాధ్యుడు వంకాయలపాటి సత్యనారాయణ రూ.10,016 వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కనపర్తి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఆలస్యం నాగమణి, బసవయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

ఏన్కూరు,ఫిబ్రవరి2: జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనీమియా ముక్తి భారత్‌లో భాగంగా శుక్రవారం 8,9,10 తరగతులు విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతాన్ని బట్టి వారికి ఐరన్ టాబ్లెట్స్, అల్బెండాజోల్ టాబ్లెట్స్ అందజేశారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం కూరాకుల సైదయ్య, ఎంపీహెచ్‌ఎం పుణ్యవతి, ఏఎన్‌ఎంలు భారతి, అరుణ, ల్యాబ్ టెక్నిషియన్ యాస్మిన్, ఆశావర్కర్లు అనురాధ, స్వాతి, పాఠశాల ఉపాధ్యాయులు సుజాత, రాధ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం

మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి2: గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికితీసేందుకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. పీఎస్ఆర్ యూత్ నాయకుడు ఏనుగు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలేరు నియోజకవర్గస్థాయి పీఎస్ఆర్ క్రికెట్ పోటీలను శుక్రవారం దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, డీవైఎస్ఓ సునిల్‌రెడ్డి, మూర్తి, కాంగ్రెస్ నాయకులు మద్ది వీరారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కూర్మారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.